# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

http://vaasthavanestham.com

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 | సంచిక : 197 | శనివారం 20 జనవరి 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# మోదీ మైండ్ గేమ్‌లో విపక్షాలు



- రాజకీయం చేయడంలో, ప్రతిపక్షాలను సంకట స్థితిలో నెట్టడంలో మోదీ అండ్ టీం సక్సెస్
- రామాలయ పున:ప్రతిష్టకు రాలేమని తేల్చి చెప్పిన ప్రతిపక్ష నేతల్లో ప్రతిపక్ష నేతలు
- ఇది భాజపా, ఆరెస్సెస్ కార్యక్రమమని అందుకే రాబోమన అంటున్న విపక్షాలు
- ప్రతిష్టాపనకు వెళ్లకపోవడం ద్వారా వాళ్లు కొన్ని వర్గాల వారిని శాంతింపచేయవచ్చు
- మెజారిటీ హిందువుల మనోభావాలు దెబ్బతింటాయని ఆలోచించడం లేదు.
- ప్రతిపక్షాల గైర్హాజరీని కూడా తనకు కన్వీనియంట్‌గా వాడుకుంటున్న మోదీ
- మీడియా ప్రాపగాండా విషయంలో ఆయనను మించిన వాళ్లు లేరు

-2లో



## స్లీప్‌మోడ్‌లోనూ సిగ్నళ్లు..

- భారత అంతరిక్ష సంస్థ ఇస్రో కీలక అప్‌డేట్
- చంద్రునిపై 14 రోజులు పగలు, 14 రోజులు రాత్రి ఉంటుందని సంగతి తెలిసిందే.
- ఈ కారణంగా రాత్రిళ్లు ఉష్ణోగ్రత దాదాపు మైనస్ 200 వరకు ఉంటోంది.
- చంద్రయాన్-3లో అమర్చిన పరికరాలు నిద్రాణ స్థితిలోనూ దక్షిణ ధ్రువం నుంచి లోకేషన్లు గుర్తిస్తున్నట్లు ఇస్రో వెల్లడి
- డిసెంబరు 12 నుంచి ఎల్ఆర్ఏ నుంచి సంకేతాలు అందినట్లు పేర్కొన్న ఇస్రో

## రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ గుర్తే ఉండదు

- పులి బయటికి వస్తే బోనులో వేసి చెట్టుకు వేలాడదీస్తాం..
- వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను వంద మీటర్ల లోతులో పాతిపెడతాం
- లోక్‌సభ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ చుద్దామన్నా కూడా కనిపించదు
- ఒక్క ఎన్నిక విషయంలోనే బీఆర్ఎస్ నేతలు బొక్కబోర్లా పడ్డారు
- లండన్ పర్యటనలో సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీకి గట్టి కౌంటర్ ఇచ్చారు. పులి బయటికొస్తుందని ఇటీవల వ్యాఖ్యలు చేసిన కేటీఆర్‌కు రేవంత్ రెడ్డి తనదైన శైలిలో రిప్లై ఇచ్చారు. పులి బయటికి వస్తే బోనులో వేసి చెట్టుకు వేలాడదీస్తామని రేవంత్ వ్యాఖ్యలు చేశారు. అయితే తెలంగాణకు పెట్టుబడులు తీసుకురావడంలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తుతం లండన్‌లో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం పలు కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఆ తర్వాత అక్కడ ఉన్న తెలంగాణ వ్యక్తులు, కాంగ్రెస్ అభిమానులతో రేవంత్ భేటీ -మిగతా3లో



## భారీ పెట్టుబడులే లక్ష్యం

- ఇన్వెస్ట్ ఇన్ తెలంగాణ.. జెడ్డాలో నేడు రోడ్ షో
- పెట్టుబడుల కోసం సౌదీలో కీలక సమావేశాలు
- ప్రముఖ ఇన్వెస్ట్ మెంట్ కంపెనీ సెడ్కో కేపిటల్స్ ప్రతినిధులతో మంత్రి శ్రీధర్ బాబు
- పట్టుబడులే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు
- సౌదీ బ్రదర్స్ కమర్షియల్ కంపెనీ సీఈవో, బోర్డ్ సభ్యులతో భేటీ

హైదరాబాద్

తెలంగాణకు భారీ పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విదేశీ పర్యటనలో బిజీగా ఉన్నారు. ఇదివరకే దావోస్ లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సు వార్షిక సమావేశాల్లో దాదాపు రూ. 40 వేల కోట్ల పెట్టుబడుల కోసం ఆయా సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం అగ్రిమెంట్ చేసుకున్న విషయం తెలిసిందే. మరిన్ని పెట్టుబడుల కోసం దావోస్‌కు కొనసాగింపుగా -మిగతా3లో


## గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిని బయటకు తీస్తా



- బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్భాటం మాత్రమే చేసింది: మంత్రి పొంగులేటి
- గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని బయటకు తీస్తామని హెచ్చరిక
- మేడారం జాతరకు ప్రభుత్వం రూ.105 కోట్లు ఇస్తోందని వెల్లడి
- ప్రజల సొమ్ము వృథా కాకుండా చూస్తామన్న పొంగులేటి

హనుమకొండ

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్భాటం మాత్రమే చేసిందని... వ్యక్తిగత లాభం కోసం పనులు చేశారని... కానీ ప్రజల గురించి ఆలోచించలేదని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. శనివారం ఆయన వరంగల్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని బయటకు తీస్తామని హెచ్చరించారు. మేడారం జాతరకు ప్రభుత్వం రూ.105 కోట్లు ఇస్తోందన్నారు. ఈ జాతర పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో -మిగతా3లో



## భారత్‌లోకి మయన్మార్ సైనికులు.. భారత్ కీలక నిర్ణయం

- భారత్-మయన్మార్ సరిహద్దుల్లో త్వరలో పటిష్టమైన కంచెను ఏర్పాటు
- మనదేశంలోకి సరిహద్దులు దాటుకొని మయన్మార్ సైనికులు రావటం సాధ్యం కాదు
- జుంటా ఆర్మీ స్థావరాలను ఆ దేశ అంతర్గత ఘర్షణలో భాగంగా ప్రజాస్వామ్య అనుకూల తిరుగుబాటు సంస్థ అరకన్ ఆర్మీ స్వాధీనం

## జనవరి కరెంట్ బిల్లులు కట్టకండి

- తెలంగాణ ప్రజలకు కేటీఆర్ పిలుపు
- లండన్‌లో సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- బీఆర్ఎస్ బొందపెడతానంటూ వ్యాఖ్య
- రేవంత్ వ్యాఖ్యలకు కేటీఆర్ కౌంటర్
- ముందు హామీలు నెరవేర్చాలని సూచన
- నీలాంటోళ్లను ఎంతో మందిని చూశామంటూ సంచలన వ్యాఖ్యలు




హైదరాబాద్

బీఆర్ఎస్‌ను బొందపెట్టి తీరతానంటూ తెలంగాణ ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ పడింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు, రేవంత్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ లాంటోళ్లను చాలామందిని చూశామని వ్యాఖ్యానించిన ఆయన.. ఈ క్రమంలో తీవ్రస్థాయిలోనే విమర్శలు గుప్పించారు. అలాగే జనవరి నెల కరెంట్ బిల్లులు ఎవరూ కట్టవద్దంటూ తెలంగాణ ప్రజలకు కేటీఆర్ పిలుపు ఇచ్చారు. బీఆర్ఎస్‌ను వంద మీటర్ల లోతున బొందపెట్టే సంగతి తర్వాత చూసుకుందాం. ముందు 100 రోజుల్లో ఇచ్చిన -మిగతా3లో

# అగ్రరాజ్యంలో అయోధ్య..

**న్యూయార్క్ :** అయోధ్య వేడుక కోసం దేశంలోని భక్తులే కాదు ఔఖీఎలూ వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా అమెరికాలో ఈ సందడి ఎక్కువగా కనిపిస్తోంది. భారతీయుల జనాభా ఎక్కువగా ఉండే అగ్రరాజ్యంలోనూ హిందువులు పెద్ద ఎత్తున వేడుకలు చేసుకుంటున్నారు. హిందూ యూనివర్సిటీ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో అక్కడ భారీ ర్యాలీలు చేపడుతున్నారు. కొన్ని చోట్ల కార్ల ర్యాలీ జరుగుతోంది. దాదాపు వారం రోజులుగా అక్కడ సందడి వాతావరణం కొనసాగుతోంది. టెక్సాస్‌లోని శ్రీ సీతారామ్ ఫౌండేషన్ కూడా హౌస్టన్‌లో శ్రీరామ జన్మభూమి ప్రాణప్రతిష్ఠ వేడుక నిర్వహించనుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులందరికీ ఇది ఎంతో అపురూపమైన రోజు అంటూ ఆనందం వ్యక్తం చేస్తోంది. "వందల ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన అయోధ్య ఇవాళ మళ్లీ ఉద్భవిస్తోంది. సనాతన ధర్మాన్ని నిలబెట్టేందుకు రూపు దిద్దుకుంది. దాదాపు 550 ఏళ్ల తరవాత బాల రాముడికి ఆలయ నిర్మాణం జరిగింది. ఇక్కడే కాదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులు ఎంతో ఆనందించాల్సిన విషయం ఇది"- కల్యాణ్ విశ్వనాథన్, అధ్యక్షుడు, హిందూ యూనివర్సిటీ ఆఫ్ అమెరికా సాంస్కృతిక కార్యక్రమాలు..హౌస్టన్‌లో సుందరా కాండ పారాయణం చేయనున్నారు. దీంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆ తరవాత శ్రీరామ చంద్రుడికి



పట్టాభిషేకం చేసి అందరికీ ప్రసాద వితరణ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రాణ ప్రతిష్ఠ జరిగిన రోజే ఈ కార్యక్రమాలు చేపట్టనున్నారు. కొంతమంది పాకిస్థానీలూ ఈ వేడుకల్లో పాల్గొంటుండటం విశేషం. అమెరి కాలోని దాదాపు వెయ్యి ఆలయాల్లో ఆ రోజున రకరకాల కార్యక్రమాలు జరగనున్నాయి. 20 నగరాల్లో కార్ల ర్యాలీలు చేపట్టనున్నారు. కాలిఫోర్నియాలో దాదాపు 600 కార్లతో ఈ ర్యాలీ జరగనుంది. ఇప్పటికే టెస్లా మ్యూజికల్ నైట్ నిర్వహించారు

# మోదీ మైండ్ గేమ్‌లో విపక్షాలు


అయోధ్య అంశాన్ని రాజకీయం చేయడంలో, ప్రతిపక్షాలను సంకట స్థితిలో నెట్టడంలో మోదీ అండ్ టీం సక్సెస్ అయినట్లే కనిపిస్తోంది. ప్రతిపక్ష నేతల్లో ఎక్కువమంది రామాలయ పున:ప్రతిష్టకు రాలేమని తేల్చి చెప్పారు. ఇది భాజపా, ఆరెస్సెస్ కార్యక్రమమని అందుకే రాబోమని చెబుతున్నారు. ఈ విషయంలో వారు చారిత్రక తప్పిదం చేసినట్లేనని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ప్రతిష్టాపనకు వెళ్లకపో వడం ద్వారా వాళ్లు కొన్ని వర్గాల వారిని శాంతింపచేయవచ్చు. మెజారిటీ హిందువుల మనోభావాలు దెబ్బతింటాయని ఆలోచించడం లేదు. ఒకవేళ హిందువులు పట్టించుకోకపోయి నా, గుర్తు చేసి గుచ్చడానికి బీజేపీ రెడీగా ఉంది. ఆ పార్టీకి కూడా ఇదే కావాల్సింది. రామమందిర ప్రతిష్టనే కాదు, ప్రతిపక్షాల గైర్హాజరీని కూడా మోదీ తనకు కన్వీనియంట్‌గా వాడుకుంటారు. మీడియా ప్రాపగాండా విషయంలో ఆయనను మించిన వాళ్లు లేరు.కాంగ్రెస్ రాజమాత సోనియా గాంధీ, అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా సీనియర్ నేతలంతా ప్రతిష్టకు వెళ్లడం లేదు. భాజపా కార్యక్రమం కాబట్టి వెళ్లడం లేదని చెప్పారు. సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్.. తనకు బీసీ, ఎస్సీ, ఎస్టీలే దేవుళ్లని, అందుకే రామమందిర ప్రారంభానికి వెళ్లనని చెబుతున్నారు. ఆయనతో పాటు, శశిథరూర్ లాంటి కాంగ్రెస్ నేతలు ప్రతిష్ట అయిన తర్వాత వెళ్తామని చెప్పారు. ముహూర్తానికి వెళ్తే ఏంటి సమస్యో వాళ్లే చెప్పాలి. సనాతన ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన డీఎంకే వారసుడు ఉదయనిధి ఇప్పుడు నిశ్శబ్దంగా ఉన్నారు. గుళ్లు గోపురాలు తిరిగే స్టాలిన్ భార్యకు భాజపా ఆహ్వానం పంపింది. అక్కడ నుంచి స్పందన ఉండకపోవచ్చు. మమతా బెనర్జీ, శరద్ పవార్ కూడా వెళ్లడం లేదు. హిందువుల ఆగ్రహానికి గురి కాకుండా తమ రాష్ట్రాల్లోనే ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. భాజపా హయాంలోనే అయోధ్యపై రామ్‌మందిర ట్రస్ట్‌కు పాజిటివ్‌గా సుప్రీం కోర్ట్ తీర్పు ఇచ్చింది. ఈ నాలుగేళ్లలోనే మందిర నిర్మాణం కూడా పూర్తయింది. ఇవన్నీ కాదనలేని నిజాలే. కానీ అయోధ్యను నిర్మించింది భాజపా కాదు. హిందువులంతా కూడా భాజపా కార్యకర్తలు కాదు. ఈ విషయాన్ని ప్రతిపక్షం గుర్తించడం లేదు. తమ ప్రయోజనాలను భాజపా, ఆరెస్సెస్ మాత్రమే కాపాడగలవని హిందువులను నమ్మించడంలో మోదీ గణం పూర్తిగా సక్సెస్ అయింది. గతంలో న్యూట్రల్‌గా ఉన్న హిందువులు కూడా ఇప్పుడు భాజపా వైపు మళ్లుతున్నారు. ఈ



ట్రెండ్ ఉత్తరాదిలో చాలా ఎక్కువగా ఉంది. ఈ ప్రభావం లోక్‌సభ ఎన్నికలపై ఖచ్చితంగా ఉంటుంది. కొన్ని పార్టీలు, కొన్నాళ్లు మైనారిటీల ప్రాపకం కోసం పాకులాడితే, భాజపా మెజారిటీ హిందూ ఓట్లను పోలరైజ్ చేసుకుంటోంది. ఎన్నికల ప్రచారంలో రామమందిర ప్రారంభోత్సవానికి రాకపోవడంపై కమలం నేతలు అడిగే ప్రశ్నలకు ప్రతిపక్షాలు ముందే సమాధానాలు సిద్ధం చేసుకోవాలి. రామాలయ నిర్మాణం కంటే దేశంలో చాలా సమస్యలు ఉన్నాయని కన్విన్స్ చేయగలగాలి. 60 ఏళ్లు అధికారంలో ఉన్నప్పుడు మీరేం చేశారు అని భాజపా అడిగితే.. కౌంటర్ ఇవ్వగలగాలి. లేదంటే 2024కు నీళ్లొదులుకుని, 2029లో అధికారం సాధించడానికి ఇప్పట్నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి.మరో వైపు యోధ్య రామ మందిర నిర్మాణంపై ఖీూా పూర్తి స్థాయిలో ఫోకస్ చేయడానికి ఓ రెండు ఘటనలు సహకరించాయి. 1980 కి ముందు నుంచే అఖాడాలు. .అంటే సాధువులు అయోధ్యలో రామ జన్మభూమిపై క్యాంపెయినింగ్ చేస్తున్నారు. అది క్రమంగా ఉద్ధృతమైంది. ఇది ఖీూాని బాగా ఆకర్షించింది. ఆ తరవాత 1981లో తమిళనాడులో మీనాక్షిపురం గ్రామంలో జరిగిన ఓ సంఘటన ఖీూా సిద్ధాంతాలను పూర్తిగా మార్చేసింది. దళితులందరినీ భారీ ఎత్తున ఇస్లాం మతంలోకి మార్చేశారు. అంతే కాదు. మీనాక్షిపురం అనే పేరుని రహమత్ నగర్‌గా మార్చేశారు. అప్పట్లో బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న అటల్ బిహారీ వాజ్‌పేయీ ఆ ప్రాంతంలో పర్యటించారు. ఎందుకీ స్థాయిలో మతమార్పిడి జరిగిందో ఆరా తీశారు. వాజ్‌పేయీ పర్యటన తరవాత ఈ ఘటనపై అందరి దృష్టి మళ్లింది. ముస్లింల నుంచి తమకు ముప్పు పొంచి ఉందన్న భయంతోనే చాలా మంది ఇస్లాంలోకి మారారని కొందరు తేల్చారు. అప్పుడే ఖీూా సహా విశ్వ హిందూ పరిషత్ జోక్యం చేసుకుంది. హిందువులందరినీ ఏకం చేయాల్సిన సమయం వచ్చిందని భావించింది. ఇందులో భాగంగానే మూడేళ్ల తరవాత 1984లో ఢిల్లీలో ధర్మ సంసద్ నిర్వహించారు. అయోధ్య, మధుర, కాశీ ప్రాంతాల్లో హిందువులను ఒక్కతాటిపైకి తీసుకురావడమే లక్ష్యంగా ఓ తీర్మానం చేశారు. అదే సంవత్సరం అయోధ్య ఉద్యమాన్ని మొదలు పెట్టారు. యూపీ అంతటా బాల రాముడి బ్యానర్‌లు కట్టారు. రామ పాదుక సేవ, రామ్ శిలా పూజన్ లాంటి కార్యక్రమాలతో ఉద్యమాన్ని ఉద్ధృతం చేసింది 1989లో రామ మందిర నిర్మాణంపై ప్రత్యేక తీర్మానం చేసింది. ఈ తీర్మానం హిందూ ధర్మ పరంగా ఖీూాకి, రాజకీయ పరంగా కి బలమైన పునాదులు వేసింది. 1989 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని కింగ్‌మేకర్‌గా చేసింది అయోధ్య రామ మందిర అంశమే. అప్పటి నుంచి ఖీూాతో పాటు విశ్వహిందూ పరిషత్, బీజేపీ అయోధ్య రామ మందిర అంశాన్ని ప్రజల్లోకి బాగా తీసుకెళ్లగలిగాయి. అది రామజన్మభూమేనని, అక్కడ మందిరం కట్టాల్సిందేనని విస్తృతంగా ప్రచారం చేశాయి. ఆ మద్దతుతో రావడం వల్లే మూడేళ్ల తరవాత మూడేళ్ల తరవాత అయోధ్య వివాదాన్ని మలుపు తిప్పిన ఘటన జరిగింది. 1992లో కరసేవకులు బాబ్రీ మసీదుపై దాడి చేశారు. కొంత భాగాన్ని ధ్వంసం చేశారు. ఈ దాడి తరవాత అప్పటి ప్రభుత్వం ఖీూాపై నిషేధం విధించింది. ఆ తరవాతే ఈ వివాదంపై కచ్చితంగా దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడింది. అటు హిందువులు, ఇటు ముస్లింలు వరుస పెట్టి కోర్టులలో పిటిషన్‌లు వేశారు. దాదాపు మూడు దశాబ్దాల పాటు కోర్టులో నలిగిన ఈ వివాదంపై 2019లో సుప్రీంకోర్టు తుది తీర్పునిచ్చింది. అలా రామ మందిర నిర్మాణానికి మార్గం సుగమమైంది. సుప్రీంకోర్టు ఈ చరిత్రాత్మక తీర్పునివ్వక ముందు నుంచీ ఖీూా ఒకే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. "అది రామ జన్మభూమి అవునో కాదో కోర్టే తేల్చాలి" అనే వాదనే వినిపించింది. చివరకు అనుకూలంగా తీర్పు రావడం వల్ల ఆ సంస్థ కల నెరవేరింది.

# స్లీప్‌మోడ్‌లోనూ సిగ్నళ్లు..

చంద్రయాన్-3 మిషన్‌కు సంబంధించి భారత అంతరిక్ష సంస్థ ఇస్రో కీలక అప్‌డేట్ అందించింది. చంద్రునిపై 14 రోజులు పగలు, 14 రోజులు రాత్రి ఉంటుందని సంగతి తెలిసిందే. ఈ కారణంగా రాత్రిళ్లు ఉష్ణోగ్రత దాదాపు మైనస్ 200 వరకు ఉంటోంది. ఈ వాతావరణ పరిస్థితుల్లో పరిశోధనలు సాధ్యం కాకపోవడంతో సెప్టెంబర్ 2 రోవర్, సెప్టెంబర్ 4న ల్యాండర్‌ను స్లీప్ మోడ్‌లో ఉంచారు. అయితే చంద్రయాన్-3లో అమర్చిన పరికరాలు నిద్రాణ స్థితిలోనూ దక్షిణ ధ్రువం నుంచి లొకేషన్లు గుర్తిస్తున్నట్లు ఇస్రో అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను బెంగళూరులో వారు ధ్రువీకరించారు. అంతర్జాతీయ అంతరిక్ష ఒప్పందాల్లో భాగంగా చంద్రయాన్-3 ల్యాండర్‌లో వివిధ దేశాలకు చెందిన కొన్ని పరికరాలను అమర్చారు. అయితే అందులో నాసాకు చెందిన లూనార్ రికనిసెన్స్ ఆర్బిటర్ (ఎల్‌ఆర్‌ఓ)లోని లేజర్ రెట్రో రెఫ్లెక్టర్ అరే (ఎల్‌ఆర్‌ఏ) చంద్రుడి దక్షిణ ధ్రువంలోని లొకేషన్ మార్కర్ సేవలను పునరుద్ధరించిందని తెలిపారు. డిసెంబరు 12 నుంచి ఎల్‌ఆర్‌ఏ నుంచి సంకేతాలు అందినట్లు ఇస్రో పేర్కొంది. చంద్రయాన్-3లో పలు సంస్థలకు చెందిన ఎల్‌ఆర్‌ఏలను అమర్చినా నాసాకు చెందిన ఎల్‌ఆర్‌ఏ నిత్యం పనిచేస్తోందని ఇస్రో చెప్పింది. దక్షిణ ధ్రువంలోని రాత్రి సమయాల్లో ఎల్‌ఆర్‌ఏ పర్యవేక్షణ ప్రారంభిస్తుంది. చంద్రయాన్-3లోని 8 ఫలకల రెట్రో రిఫ్లెక్టర్లు దక్షిణ ధ్రువంలోని వాతావరణాన్ని తట్టుకునేలా ఏర్పాటు చేశారు. దాదాపు 20 గ్రాముల బరువుండే ఈ పరికరం పదేళ్ల పాటు చంద్రుని ఉపరితలంపై మనుగడ సాగించే అవకాశం ఉందని ఇస్రో వర్గాలు తెలిపాయి.



ఇస్రో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-3 మిషన్ ఆగస్టు 23న విజయవంతంగా సాఫ్ట్ ల్యాండింగ్ అయిన విషయం తెలిసిందే. ల్యాండర్ దిగిన ప్రదేశాన్ని భారత్ 'శివ శక్తి పాయింట్'గా నామకరణం చేసింది. ల్యాండర్ నుంచి రోవర్ బయటకు వచ్చి చంద్రుని ఉపరితలంపై విజయవంతంగా ప్రయోగాలు నిర్వహించింది. 14 రోజులపాటు అక్కడి వాతావరణ, నీటి పరిస్థితి, ఖనిజాల గురించి అధ్యయనం చేసి కీలక సమాచారాన్ని ఇస్రోకు చేరవేసింది. ఇస్రో మొదట రోవర్ 300-350 మీటర్ల దూరం ప్రయాణించేలా ప్లాన్ చేసింది. అయితే కొన్ని కారణాల వల్ల రోవర్ ఇప్పటి వరకు 105 మీటర్లు మాత్రమే కదిలింది. అయినప్పటికీ, మిషన్ దాని లక్ష్యాలను అధిగమించింది.

## న్యూ జెర్సీలో మంచు తుఫాను బీభత్సం



**న్యూజెర్సీ:** అమెరికాలో దట్టమైన మంచు తుఫాను కురుస్తోంది. దేశంలోని ప్రముఖ నగరాల్లో ఒకటైన న్యూజెర్సీలో మంచు తుఫాను విశ్వరూపం చూపుతోంది. వింటర్ స్టార్మ్ కారణంగా హైవేలపై అడుగుల కొద్దీ మంచు పేరుకుపోయింది. రోడ్డపై గుట్టలు గుట్టలుగా మంచు పేరుకుపోవడం వల్ల కార్లు నడవలేని పరిస్థితి ఏర్పడింది. వాహనాలు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో రోడ్లపై సుమారు 2 నుంచి 6 అంగుళాల మధ్య మంచు కమ్మేసినట్లు స్థానికులు చెబుతున్నారు.


న్యూజెర్సీతో పాటు దేశంలోని చాలా నగరాల్లో కరెంటు సరఫరా ఆగిపోయి ఆ ప్రాంతాలన్నీ చీకటిమయమైపోయాయి. రోడ్లపై మంచు పేరుకుపోవడంతో అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు సైతం రాలేని పరిస్థితి నెలకొంది. మంచు తుఫాన్ కారణంగా విమానాలు, రైళ్లు, ఇతర రవాణా సర్వీసులను రద్దు చేశారు. పలు ప్రాంతాల్లో 4 నుంచి 12 అంగుళాల మధ్య మంచు కురిసే అవకాశం ఉందని అమెరికా వాతావరణ శాఖ తెలిపింది. భారీ మంచు తుఫాన్ నేపథ్యంలో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని అధికారులు హెచ్చరించారు.

## రామ మందిర్‌డేగా గుర్తించిన మూడు కెనడా మునిసిపాలిటీలు




**టొరంటో:** జై శ్రీరామ్ నినాదాలు ప్రపంచవ్యాప్తంగా మార్మోగుతున్నాయి. 22న అయోధ్య రాముని ప్రాణప్రతిష్ట జరగనున్న విషయం తెలిసిందే. ఈ వేడుక ఎప్పుడెప్పుడా అని ప్రపంచంలోని రామ భక్తులంతా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలోనే కెనాడాలోని మూడు మునిసిపాలిటీలు జనవరి 22వ తేదీని రామ మందిర్ డే గా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేశాయి. బ్రాంప్టన్, ఓక్ విల్లే, బ్రాంట్‌ఫోర్డ్ మునిసిపాలిటీలు 22ను రామ మందిర్ డేగా అధికారికంగా ప్రకటించాయి. మూడు మునిసిపాలిటీల నుంచి 22వ తేదీని అధికారిక రామ మందిర్ డేగా గుర్తించినట్లు ఉత్తర్వులు తీసుకోవడంలో విజయవంతమైనట్లు హిందూ కెనడియన్ ఫౌండేషన్(హెచ్‌సీఎఫ్) అధ్యక్షుడు అరుణేష్ గిరి తెలిపారు. గ్రేటర్ టొరంటో ఏరియా(జీటీఏ)లోనూ రాముని ప్రాణప్రతిష్ట వేడుకకు సంబంధించి హోర్డింగులు పెట్టినట్లు ఇవి పండుగ వాతావరణాన్ని వ్యాప్తి చేస్తున్నాయని గిరి చెప్పారు. కెనడా వ్యాప్తంగా హిందూ సంఘాలతో కలిసి రామ మందిర ప్రారంభోత్సవ వేడుకలు జరుపుకుంటున్నామని తెలిపారు.

## భారత్‌లోకి మయన్మార్ సైనికులు.. భారత్ కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ:** మయన్మార్ ప్రభుత్వ ఆర్మీ(జుంటా) సైనికులు భారత్‌లోకి చొచ్చుకురావటంపై కేంద్ర హోం శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. భారత్-మయన్మార్ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులను అదుపు చేయటంలో భాగంగా భారత సరిహద్దుల వెంట త్వరలో పటిష్టమైన కంచెను ఏర్పాటు చేయనున్నట్లు హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుల్లో ఎలాంటి కంచె ఉందో.. ఇక్కడ (భారత్-మయన్మార్) సరిహద్దు వద్ద కూడా చాలా పటిష్టమైన కంచె ఏర్పాటు చేస్తామని అన్నారు. దీంతో మనదేశంలోకి సరిహద్దులు దాటుకొని మయన్మార్ సైనికులు రావటం సాధ్యం కాదని పేర్కొన్నారు. సుమారు 600 మంది మయన్మార్ ఆర్మీ సైనికులు సరిహద్దు దాటి మిజోరం రాష్ట్రంలోకి వచ్చారు. జుంటా ఆర్మీ స్థావరాలను ఆ దేశ అంతర్గత ఘర్షణలో భాగంగా ప్రజాస్వామ్య అనుకూల తిరుగుబాటు సంస్థ అరకన్ ఆర్మీ (%ూూా%) స్వాధీనం చేసుకున్నాయి. దీంతో ఆర్మీ సైనికులు మిజోరంలోని సరిహద్దు లాంగ్ట్లై జిల్లాలోకి వచ్చారు. ప్రస్తుతం మయన్మార్ ఆర్మీ సైనికులు అస్సాం రైఫిల్స్ సైనిక క్యాంప్‌లో ఆశ్రయం పొందుతున్నారు. మయన్మార్ ఆర్మీ సైనికుల విషయాన్ని.. మిజోరం సీఎం లాల్దుహోమా కేంద్ర హోం మంత్రి అమిత్ షా దృష్టికి తీసుకువెళ్లారు. భారత సరిహద్దుల్లోని మిజోరం ప్రాంతం నుంచి మయన్మార్ ఆర్మీ సైనికులను వెనక్కి పంపించాలని కేంద్రాన్ని ఆయన అభ్యర్థించిన విషయం తెలిసిందే.

## అయోధ్యకు ఆఫ్గనిస్థాన్ కానుక



అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవానికి సన్నాహాలు దాదాపు పూర్తయ్యాయి. ఆలయంలో కొలువయ్యే బాలరామునికి ఆఫ్గనిస్థాన్‌తో సహా ప్రపంచం నలుమూలల నుండి కానుకలు అందుతున్నాయి. విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు అలోక్ కుమార్ తాజాగా కశ్మీర్, తమిళనాడు, ఆఫ్గనిస్థాన్ నుండి వచ్చిన కానుకలను రామాలయ ట్రస్ట్‌కు అందజేశారు. అయోధ్య రామాలయ నిర్మాణంపై ముస్లిం సమాజం కూడా సంతోషంగా ఉందని అలోక్ కుమార్ పేర్కొన్నారు. కాశ్మీర్‌కు చెందిన ముస్లిం సోదరులు, సోదరీమణులు తనను కలవడానికి వచ్చి, రామమందిర నిర్మాణంపై సంతోషం వ్యక్తం చేస్తూ, వారు సేంద్రియ పద్ధతిలో తయారు చేసిన రెండు కిలోల స్వచ్ఛమైన కుంకుమపువ్వును అందజేశారన్నారు. ప్రపంచంలోని వివిధ దేశాలతో పాటు ఆఫ్గనిస్థాన్ నుండి కూడా ప్రత్యేక బహుమతి వచ్చిందని అలోక్ కుమార్ చెప్పారు. ఆఫ్గనిస్థాన్‌లోని కాబూల్‌లో గల 'కుబా'నదిలోని నీటిని కానుకగా స్వీకరించామని అన్నారు. తమిళనాడుకు చెందిన పట్టు వస్త్రాల తయారీదారులు శ్రీరాముని ఆలయ చిత్రంతో నేసిన సిల్క్ దుస్తులను పంపారన్నారు.

# జనవరి కరెంట్ బిల్లులు కట్టకండి

-మొదటి పేజి తరువాయి

హామీలను అమలు చేయండి అని కేటీఆర్ సీఎం రేవంత్‌కు చురకలు అంటించారు. అహంకారంతో మాట్లాడిన రవేంత్‌రెడ్డి లాంటి నాయకుల్ని బీఆర్ఎస్ తన ప్రస్థానంలో ఎంతో మందిని చూసిందని.. రెండున్నర దశాబ్దాలు నిలబడి రేవంత్ లాంటోళ్లను మట్టి కరిపించిందని అన్నారాయన. "తెలంగాణ జెండాను ఎందుకు బొంద పెడుతావ్? తెలంగాణ తెచ్చినందుకా?.. తెలంగాణను అభివృద్ధి చేసినందుకా? లేకుంటే మిమ్మల్ని.. మీ దొంగ హామీల్ని ప్రశ్నిస్తున్నందుకా?" కేటీఆర్ నిలదీశారు. బీజేపీతో బీఆర్ఎస్ కు ఏరోజు పొత్తు లేదని.. భవిష్యత్తులోనూ ఉండబోదని శనివారం తెలంగాణ భవన్‌లో జరిగిన హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ బీ ఆర్ ఎస్ ఎన్నికల సన్నాహక సమావేశంలో కేటీఆర్ పునరుద్ఘాటించారు. "రేవంత్ రక్తం అంతా బీజేపీదే. అందుకే ఇక్కడ చోటా మోదీగా రేవంత్ రెడ్డి మారిండు. డబుల్ ఇంజన్ అంటే అదానీ, ప్రధాని అన్న రేవంత్ ఇప్పుడు ట్రిపుల్ ఇంజన్ గా మారిండు. రేవంత్ కాంగ్రెస్ ఏక్‌నాథ్ షిండేగా మారతాడు" అంటూ కేటీఆర్ పంచ్‌లు వేశారు.

కానీ వంద రోజుల్లో నెరవేరుస్తామన్న హామీలను అమలు చేసే అంశం పైన దృష్టి పెట్టు రేవంత్ రెడ్డి అని కేటీఆర్ హితవు పలికారు. రేవంత్ రెడ్డి లాంటి అహంకారులను బీఆర్ఎస్ పార్టీ తన ప్రస్థానంలో అనేక మందిని చూసిందని అన్నారు.సుదీర్ఘ కాలం పాటు పోరాటం చేసి తెలంగాణ సాధించినందుకు, రాష్ట్రాన్ని బంగారు తెలంగాణాగా మార్చింనందుకు, ఇచ్చిన హామీలను సమగ్రంగా అమలు చేసినందుకు బీఆర్ఎస్‌ను బొంద పెడుతావా? అని రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్, బీజేపీలు కలిసిపోతాయని షాకింగ్ కామెంట్స్ చేశారు. రేవంత్ కాంగ్రెస్ ఎక్ నాథ్ షిండేగా మారతాడని సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రక్తం అంత బీజేపీదే అని అన్నారు.హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల సమావేశంలో ప్రసంగించిన కేటీఆర్..




డబుల్ ఇంజన్ అంటే అదానీ, ప్రధాని అని చెప్పిన రేవంత్ ఇప్పుడు ట్రిపుల్ ఇంజన్ గా మారారని విమర్శించారు. అహంకారంతో మాట్లాడిన రేవంత్ లాంటి నాయకులను బీఆర్ఎస్ పార్టీ ఎన్నో చూసిందని.. అలాంటి వాళ్లందరూ మఖలో పుట్టి పుబ్బలో పోయేవాళ్లేనని ఘాటు వ్యాఖ్యలు చేశారు. రెండున్నర దశాబ్దాలుగా పార్టీ నిలబడిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కేవలం ఒక స్పీడ్ బ్రేకర్ మాత్రమేనని.. ఓడినా గెలిచినా బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ప్రజలపక్షమేనని స్పష్టం చేశారు.జనవరి నెల కరెంటు బిల్లులను ఎవరూ కట్టవద్దని కేటీఆర్ సూచించారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఉచిత విద్యుత్ పథకమైన గృహజ్యోతి హామిని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా మహాలక్ష్మి ద్వారా ప్రతి ఒక్క మహిళకు రూ.2500 వెంటనే ఇవ్వాలన్నారు. హామీలను తప్పించుకునేందుకు ప్రయత్నిస్తే కాంగ్రెస్ పార్టీని వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. బీజేపీతో బీఆర్ఎస్ కు ఏరోజూ పొత్తు లేదన్న కేటీఆర్.. భవిష్యత్ లోనూ ఉండదన్నారు. సికింద్రాబాద్ ఎంపీగా గెలుపొంది, కేంద్రమంత్రి పదవి చేపట్టిన కిషన్ రెడ్డి ఈ ఐదేండ్లల్లో ఏం చేశారో చెప్పాలని ఆక్షేపించారు. కేసీఆర్ ప్రపంచంలోనే అతిపెద్ది లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కడితే కిషన్ రెడ్డి మాత్రం సీతాఫల్ మండి రైల్వే స్టేషన్ లో లిఫ్ట్ లను జాతికి అంకితం చేశారని ఎద్దేవా చేశారు.హైదరాబాద్ నగరంలో గులాబీ జెండాకు ఎదురులేదని బలమైన సందేశం ఇచ్చిన పార్టీ కార్యకర్తలకు కేటీఆర్ ధన్యవాదాలు చెప్పారు. రాష్ట్రంలో బీజేపీని అడ్డుకున్నది బీఆర్ఎస్ పార్టీనే అని వెల్లడించారు. కేవలం 50 రోజుల కాంగ్రెస్ పాలనలో ఆటో డ్రైవర్ల నుంచి మొదలుకొని అనేకమంది ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితికి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతన్నలకు రైతుబంధు అందడం లేదు.. మహిళలకు ఇస్తామన్న రూ.2500 రావడం లేదు.. కాంగ్రెస్ ఇచ్చినవి ఆరు గ్యారంటీలు కాదు 420 హామీలు అని ప్రజలు గుర్తుంచుకోవాలని కోరారు. వివిధ డిక్లరేషన్ల పేరుతో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి ఒక్క హామిని అమలు చేసేదాకా వెంటాడతామని కేటీఆర్ స్పష్టం చేశారు.

### కరెంట్ బిల్లుల్ని సోనియాకు పంపించండి

అలాగే.. ఈ జనవరి నెల కరెంట్ బిల్లులు ఎవరూ కట్టవద్దని.. ఆ బిల్లులను ఢిల్లీలోని కాంగ్రెస్ మాజీ అధినేత్రి సోనియా గాంధీ ఇంటికి పంపించాలంటూ తెలంగాణ ప్రజలకు పిలుపు ఇచ్చారాయన. "ఈ జనవరి నెల కరెంటు బిల్లులు ప్రజలు ఎవరూ కట్టొద్దు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఉచిత విద్యుత్తు పథకం గృహజ్యోతి హామీని నెరవేర్చే దాకా బిల్లులు కట్టొద్దు. స్వయంగా ముఖ్యమంత్రి.. కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పినట్లుగానే ఉచిత విద్యుత్ కోసం డిమాండ్ చేయాలి. కరెంటు బిల్లులు అడిగితే అధికారులకు ముఖ్యమంత్రి మాటలను చూపించాలి. సోనియా గాంధీ బిల్లు కడుతుందని ముఖ్యమంత్రి ఎన్నికలప్పుడు చెప్పిండు. అందుకే కరెంటు బిల్లు ప్రతులను సోనియా గాంధీ ఇంటికి, 10జన్ పత్ కు పంపించాలి" అని కేటీఆర్ అన్నారు. అలాగే.. హైదరాబాద్‌లో ఉన్న ప్రతి ఒక్క మీటర్ కి గృహజ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్తు అందించాలని.. గృహ జ్యోతి కార్యక్రమాన్ని వెంటనే అమలు చేయాలి.. ఇందులో కిరాయి ఇండ్లలో ఉండే వాళ్ళకి కూడా ఉచిత విద్యుత్తు ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# భారీ పెట్టుబడులే లక్ష్యం

-మొదటి పేజి తరువాయి

మంత్రి శ్రీధర్ బాబు సౌదీ అరేబియా దేశంలో పర్యటిస్తున్నారు. ఇన్వెస్ట్ ఇన్ తెలంగాణ రోడ్ షో లో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొనున్నారు. జెడ్డాలో ప్రముఖ ఇన్వెస్ట్ మెంట్ కంపెనీ సెడ్కో కేపిటల్స్ ప్రతినిధులతో మంత్రి శ్రీధర్ బాబు ఆదివారం నాడు ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు సమావేశమవుతారు. 10 గంటల నుంచి 11 గంటల వరకు జెడ్డా ఛాంబర్స్ తో భేటీ జరగనుంది. అనంతరం ఆహార ఉత్పత్తుల దిగ్గజ సంస్థ అయిన సవోలా గ్రూప్ సీఈవో వలీద్ ఫతానాతో మంత్రి శ్రీధర్ బాబు చర్చలు జరుపుతారు. మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల నుంచి ఒంటిగంట వరకు సౌదీ బ్రదర్స్ కమర్షియల్ కంపెనీ సీఈవో, బోర్డ్ సభ్యులతో భేటీ అవుతారు. ఆ తర్వాత పట్రోమిన్ కార్పోరేషన్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి అక్కడ ఆ సంస్థ ప్రతినిధులతో తెలంగాణలో పెట్టుబడులుపై చర్చిస్తారు. మధ్యాహ్నం 3 గంటల 30 నిమిషాలకు బట్టర్జీ హోల్డింగ్ కంపోనీ చైర్మన్ మాజెన్ బెట్టర్జీతో సమావేశం కానున్నారు. అరాంకో సంస్థ ప్రతినిధులతో కూడా సమావేశమయ్యే అవకాశం ఉంది. అనంతరం అదేరోజు రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు షెరటన్ హోటల్ లో జరిగే ఇన్వెస్ట్



ఇన్ తెలంగాణ రోడ్ షో లో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొనున్నారు. ఈ సమావేశాల్లో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి గానూ ఉన్న అనువైన సానుకూల వాతావరణం, పరిస్థితులను గురించి మంత్రి శ్రీధర్ బాబు వివరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించే రాయితీలు, ప్రోత్సాహకాలు, ఇతర సహాయ సహకారాల గురించి అవగాహన కల్పిస్తారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం వల్ల కలిగే ప్రయోజనాలపై చర్చలు జరుపుతారు. మంత్రి శ్రీధర్ బాబు వెంట రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి జయేశ్ రంజన్, ఇన్వెస్ట్ మెంట్ అండ్ ప్రమోషన్ ప్రత్యేక కార్యదర్శి విష్ణు వర్ధన్ రెడ్డి ఉంటారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ పర్యటన సక్సెస్ అయింది. రేవంత్ టీమ్ దావోస్ పర్యటనతో రూ.40,232 కోట్ల పెట్టుబడుల ఒప్పందాలతో కొత్త రికార్డు నెలకొల్పింది. గత ఏడాది దావోస్‌లో తెలంగాణ రాష్ట్రం సాధించిన పెట్టుబడుల మొత్తం కంటే ఇది రెండింతలు అని అధికారులు తెలిపారు.అదానీ గ్రూప్, ఏూచి, వెబ్ వర్క్స్, టాటా టెక్నాలజీస్, ఃఒ ఆగ్రో, సర్జికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ గ్రూప్ హోల్డింగ్స్, గోడి ఎనర్జీ, అరజెన్ లైఫ్ సైన్సెస్, ఇన్నోవెరా ఫార్మాస్యూటికల్స్, క్యూ సెంట్రియో, సిస్ట్రా, ఉబర్, ఓ9 సొల్యూషన్స్ తదితర కంపెనీలు తెలంగాణ ప్రభుత్వంతో అగ్రిమెంట్ చేసుకున్నాయి. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆ కంపెనీలు సిద్ధంగా ఉన్నాయి.

# ఇక స్పెషల్ ఆఫీసర్ పాలన

**తెలంగాణ పల్లెల్లో ఇక స్పెషల్ ఆఫీసర్ల పాలన..**
**గ్రామపంచాయతీ ఎన్నికలు ఇప్పట్లో లేనట్టే.!**
**రాష్ట్రంలో గ్రామపంచాయతీలకు ఎన్నికలు ఇప్పట్లో లేనట్టేనా**
**మరి గ్రామాల్లో పాలన ఎలా.?**
**సర్పంచ్‌ల ప్లేస్‌లో ఎవరిని నియమిస్తారు.**

**హైదరాబాద్ :** సర్పంచ్‌లకు ఉన్న చెక్ పవర్‌ను ఎవరికి ఇస్తారు.? గ్రామాల్లో పాలనను ఎవరు కొనసాగిస్తారు అనేక అంశాలపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ప్రభుత్వం, పంచాయతీ రాజ్ అధికారులపై ఉన్నది. అయితే వచ్చే నెల 1వ తేదీతో ఇప్పుడు ఉన్న సర్పంచ్‌ల పదవికాలం ముగుస్తుంది. మరి మరికొన్ని రోజులు సర్పంచ్‌ల పదవికాలాన్ని కొనసాగిస్తారా లేక ప్రత్యేక అధికారులను నియమిస్తారా.!! వచ్చే నెల 1వ తేదితో సర్పంచ్‌ల పదవి కాలం ముగుస్తుంది. అయితే ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహణ కష్టం అని భావిస్తున్నారు ప్రభుత్వ పెద్దలు. ఎన్నికల నిర్వహణకు కనీసం 3 నెలల సమయం కావాలి అంటున్నారు రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు. కానీ అంత సమయం లేకపోవడంతో ఈ సర్పంచ్‌ల పదవి కాలాన్ని పొడిగిస్తారా లేక ప్రత్యేక అధికారి పాలన పెడతారా అనేది స్పష్టం చేయడం లేదు ప్రభుత్వం. గ్రామాల్లో ఉన్న సమస్యలు, కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తాం అని చెప్పిన 6 గ్యారెంటీలు ఎలా.? అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు గ్రామ పంచాయితీ సర్పంచ్‌లు. మరోవైపు గ్రామసభలు పెడితే 6 గ్యారెంటీలతో పాటు, ఇతర హామీలపై ప్రభుత్వాన్ని, అధికారులను ఎక్కడ నిలదీస్తారో అని ఎన్నికలను వాయిదా వేస్తోంది కాంగ్రెస్ ప్రభుత్వం అని అంటున్నారు గ్రామ సర్పంచ్‌లు.




రాష్ట్రంలో గ్రామపంచాయతీలకు ఎన్నికలు ఇప్పట్లో లేనట్టేనా అంటే అవును అనే అంటున్నారు. మరి గ్రామాల్లో పాలన ఎలా.? సర్పంచ్‌ల ప్లేస్‌లో ఎవరిని నియమిస్తారు. సర్పంచ్‌లకు ఉన్న చెక్ పవర్‌ను ఎవరికి ఇస్తారు.? గ్రామాల్లో పాలనను ఎవరు కొనసాగిస్తారు అనేక అంశాలపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ప్రభుత్వం, పంచాయతీ రాజ్ అధికారులపై ఉన్నది. అయితే వచ్చే నెల 1వ తేదీతో ఇప్పుడు ఉన్న సర్పంచ్‌ల పదవికాలం ముగుస్తుంది. మరి మరికొన్ని రోజులు సర్పంచ్‌ల పదవికాలాన్ని కొనసాగిస్తారా లేక ప్రత్యేక అధికారులను నియమిస్తారా.!!వచ్చే నెల 1వ తేదితో సర్పంచ్‌ల పదవి కాలం ముగుస్తుంది. అయితే ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహణ కష్టం అని భావిస్తున్నారు ప్రభుత్వ పెద్దలు. ఎన్నికల నిర్వహణకు కనీసం 3 నెలల సమయం కావాలి అంటున్నారు రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు. కానీ అంత సమయం లేకపోవడంతో ఈ సర్పంచ్‌ల పదవి కాలాన్ని పొడిగిస్తారా లేక ప్రత్యేక అధికారి పాలన పెడతారా అనేది స్పష్టం చేయడం లేదు ప్రభుత్వం. గ్రామాల్లో ఉన్న సమస్యలు, కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తాం అని చెప్పిన 6 గ్యారెంటీలు ఎలా.? అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు గ్రామ పంచాయితీ సర్పంచ్‌లు. మరోవైపు గ్రామసభలు పెడితే 6 గ్యారెంటీలతో పాటు, ఇతర హామీలపై ప్రభుత్వాన్ని, అధికారులను ఎక్కడ నిలదీస్తారో అని ఎన్నికలను వాయిదా వేస్తోంది కాంగ్రెస్ ప్రభుత్వం అని అంటున్నారు గ్రామ సర్పంచ్‌లు.సర్పంచ్‌ల పదవికాలం ముగియడంతో గ్రామ పంచాయితీ చెక్ పవర్ ఎవరికి ఇస్తారో అనేది ఇంకా స్పష్టం కావాల్సి ఉంది. ఆయితే ఎంపిడిఓతో పాటు గ్రామ కార్యదర్శికి ఇస్తారా.. లేక ఎమ్మార్వో, పంచాయతీ రాజ్ ఇంజనీర్‌లకు ప్రత్యేక బాధ్యతలు ఇస్తారా.. అదీకాక 4 గ్రామాలకు ఒక్క మండల స్థాయి అధికారిని ఇంచార్జిగా నియమించి వారికే చెక్ పవర్ ఇస్తారా.? అనే అంశం ఇంకా తేలాల్సి ఉంది. అయితే గతంలో 4,5 గ్రామాలకు ఒక్క మండల స్థాయి అధికారిని నియమించి గ్రామ కార్యదర్శికి చెక్ పవర్ ఇచ్చారు. ఈసారి కూడా గతం మాదిరిగానే చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది

## గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిని బయటకు తీస్తా



-మొదటి పేజి తరువాయి

మంత్రులకు కూడా గౌరవం దక్కలేదని విమర్శించారు. తాము ప్రజల సొమ్ము వృథా కాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. వరంగల్‌లో మంత్రి పొంగులేటి అధికారులతో సమావేశమయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు, డబుల్ బెడ్రూం ఇళ్లపై చర్చించినట్లు వెల్లడించారు. వరంగల్ సమీక్షలో భూకబ్జాలపై కూడా చర్చించామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతిని బయటకు తీస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. శనివారం నాడు వరంగల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ... ఉమ్మడి వరంగల్ అభివృద్ధిపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. ఇరిగేషన్‌పై మేజర్‌గా, డబుల్ బెడ్రూం ఇళ్ల పరిస్థితిపై కూడా చర్చించామన్నారు. మేడారం మహాజాతరకు 105కోట్లు ఇస్తున్నామన్నారు. యుద్ధప్రాతిపదికన పనులు జరుగుతున్నాయని చెప్పారు. గత ప్రభుత్వానిది ఆర్భటాలు మాత్రమేనని.. వ్యక్తిగత లాభం కోసమే పనులు చేశారని మండిపడ్డారు. నాడు మంత్రులకు కూడా గౌరవం లేదన్నారు. భూ కబ్జాలపై చర్చించినట్లు చెప్పారు. ప్రజల సొమ్మును దుర్వినియోగం కాకుండా చూస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

## బయటకు వచ్చేది పులి కాదు..
## కలుగులోకి వెళ్లాల్సిన ఎలుక: రఘునందన్‌రావు



**హైదరాబాద్:** బీఆర్ఎస్ పార్టీ, నేతలపై మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు మండిపడ్డారు. టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా పేరు మార్చుకున్నప్పుడే తెలంగాణతో ఆ పార్టీకి పేగుబంధం తెగిపోయిందన్నారు. హరీష్ రావు రాజకీయాల్లోకి రాకముందే(1999) మెదక్ పార్లమెంట్ స్థానాన్ని బీజేపీ గెలుచుకుందని తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మెజార్టీ సీట్లు గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీష్, సంతోష్.. అయిదుగురు పోటీ చేయాలని సవాల్ విసురుతున్నట్లు తెలిపారు. వీరెవరు పోటీ చేసినా గెలవరని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే హుస్సేన్ సాగర్‌లో వేసినట్లేనని ఎద్దేవా చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్ కుటుంబానికి వాత పెట్టడానికి తెలంగాణ సమాజం సిద్ధంగా ఉందన్నారు. కేసీఆర్‌ను కేటీఆర్ పులి అంటున్నారు. పులి జనాల్లో ఎందుకు ఉంటుంది. అడవిలో ఉంటుందనే విషయం కేటీఆర్ తెలుసుకోవాలని సెటైర్లు వేశారు. కేసీఆర్ పులి కాదు, పిల్లి అంతకన్నా కాదు. ఎలుక అంటూ ఎద్దేవా చేశారు. బయటకు వచ్చేది పులి కాదు.. కలుగులోకి వెళ్లాల్సిన ఎలుక అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు రఘునందన్‌రావు. 'గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్లు అమ్ముకుంది. పార్టీ కోసం పనిచేసిన వారికి కాకుండా సూట్ కేసులు ఇచ్చే వాళ్లకు టికెట్లను ఆ పార్టీ నాయకులు అమ్ముకుంటున్నారు. ఎర్రోళ్ల శ్రీనివాస్ లాంటి వాళ్లకు టికెట్ల ఇవ్వరు. శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు లోక్ సభ సీటు ఇవ్వగలరా?. బీజేపీ యేతర ముఖ్యమంత్రులు ప్రధానిని కలిసి నిధులు తెచ్చుకున్నారు. తెలంగాణ ప్రయోజనాల కోసం కొత్త సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోదీని కలిశారని గుర్తుచేశారు. గతంలో ప్రధాని మోదీ తెలంగాణ వస్తే అప్పటి సీఎం కేసీఆర్ మోహం చాటేశారు' అని గుర్తుచేశారు.

## రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ గుర్తే ఉండదు



-మొదటి పేజి తరువాయి

అయ్యారు. ఆ నేపథ్యంలోనే రేవంత్ రెడ్డి లోక్‌సభ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ చుద్దామన్నా కూడా కనిపించదని వ్యాఖ్యానించారు. లండన్ పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ లక్ష్యంగా ఘాటు వ్యాఖ్యలు చేశారాయన. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే పార్లమెంట్ ఎన్నిల్లోనూ రిపీట్ అవుతాయని.. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను వంద మీటర్ల లోతులో పాతిపెడతామని రేవంత్ అన్నారు.

కాగా, రేవంత్ వ్యాఖ్యలపై స్పందించిన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి.. లండన్ పర్యటనలో అసంబద్ధంగా మాట్లాడి రాష్ట్రం పరువు తీశారంటూ మండిపడ్డారు. సీఎం రేవంత్ పాండిత్యాన్ని రాష్ట్ర ప్రజలు గమనించారు. ప్రశ్న ఒకటి అయితే ఆయన చెప్పింది ఒకటి చూసి జనం నవ్వుకుంటున్నారు. కారు పార్టీని బొంద పెడతామంటూ రేవంత్ చౌక బారు మాటలు మాట్లాడారు. కేసీఆర్ సంగతి చూస్తానన్న రేవంత్ గురువు చంద్రబాబు ఏం చేయలేకపోయాడు. తెలంగాణ నుంచి పలాయనం చిత్తగించాడంటూ నిరంజన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. అంతేకాదు వచ్చే అసెంబ్లీ ఎన్నికల సమయానికి రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ గుర్తే ఉండదని రేవంత్ అన్నారు. కేసీఆర్‌ను పులితో పోల్చిన కేటీఆర్ వ్యాఖ్యల నేపథ్యంలో రేవంత్ రెడ్డి లండన్ వేదికగా స్పందించారు. ఒక్క ఎన్నిక విషయంలోనే బీఆర్ఎస్ నేతలు బొక్కబోర్లా పడ్డారని ఎద్దేవా చేశారు. అయినప్పటికీ బీఆర్ఎస్ నేతలకు మాత్రం ఆహంకారం తగ్గలేదన్నారు. వారి గర్వం, అహంకారం తగ్గించే బాధ్యత తనదేనని రేవంత్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమిపాలైన తర్వాత వారికి భయం పట్టుకుని ఇలా మాట్లాడుతున్నారని రేవంత్ రెడ్డి అన్నారు.

## సంపాదకీయం

# ఒంటరిపోరులో ఏనుగు గెలుస్తుందా!

వచ్చే ఏప్రిల్, మే లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఏ కూటమితో సంబంధం లేకుండా ఒంటరిగా పోటీ చేస్తామని బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షురాలు మాయావతి చేసిన ప్రకటన కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'ఇండియా' కూటమి చేస్తున్న ప్రతిపక్ష ఐక్యతా యత్నాలను నీరుగార్చినట్లయ్యింది. 543 లోక్‌సభ స్థానాలకు గాను సాధారణ మెజారిటీ రావాలంటే ఏ పార్టీ, కూటమి అయినా 272 స్థానాలు సాధించాల్సి ఉంటుంది. 80 లోక్‌సభ స్థానాలు గల ఉత్తరప్రదేశ్‌లో అత్యధిక స్థానాలు గెలిచిన పార్టీకే కేంద్రంలో దక్కుతున్న ఆనవాయితీ వుంది. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని పాలక భారతీయ జనతా పార్టీ 2014 నుండి గరిష్ఠ స్థానాలు గెలుస్తూ వస్తోంది. ఈసారి కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్ వాదీ, బిఎస్‌పి, ఆమ్ ఆద్మీ, సిపిఐ, సిపిఎం, లాలూ నేతృత్వంలోని ఆర్‌జెడి, బీహార్ సిఎం నితీశ్ కుమార్ నాయకత్వంలోని జె డియు, తమిళనాడులో డిఎంకె, మిత్రపక్షాలతో కలిసి ఆయా రాష్ట్రాల్లో లౌకిక ప్రజాస్వామ్య ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసి కమలం పార్టీపై ఒకే ఉమ్మడి అభ్యర్థిని బరిలోకి దింపాలని, మోడీ బిజెపి మళ్ళీ గెలవకుండా నిరోధించాలని 'ఇండియా' కూటమి గట్టి ప్రయత్నాలే చేస్తున్న సంగతి తెలిసిందే. ఉత్తరప్రదేశ్‌లో 80 లోక్‌సభ స్థానాల్లో 17 ఎస్‌సి రిజర్వ్‌డ్ స్థానాలు. వాటిలో కాషాయ పార్టీ 2014లో 72 స్థానాలు, 2019 లోక్‌సభ ఎన్నికల్లో 62 స్థానాలు అత్యధికంగా గెలిచి వరుసగా రెండు దఫాలు కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. ఈసారి వరుసగా 3వసారి ప్రధాని కావాలని, రికార్డులు తిరగరాయాలని మోడీ బహుముఖ వ్యూహంతో గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు. అందుకు అయోధ్యలో దివ్యమైన, భవ్యమైన రామాలయ ప్రారంభోత్సవానికి జనవరి 22న సంప్రోక్షణ కార్యక్రమాన్ని అట్టహాసంగా, నభూతో నభవిష్యతి అనే రీతిలో నిర్వహిస్తూ ఘనత అంతా తమ ప్రభుత్వానిదేనని చాటుతున్నారు. పురుషోత్తముడు, సకల గుణాభిరాముడు, భారతీయులకు తరతరాలుగా ఆరాధ్య దైవంగా ఉన్న శ్రీరామచంద్రుని రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకుంటున్నారనే విమర్శలను కమలనాథులు ఖాతరు చేయడం లేదు. దేశంలో పల్లెపల్లెనా రాములగుడి ఉంది. అందునా తెలుగు వారికి శ్రీరాముడు ఆరాధ్య దైవం. భద్రాద్రి రామయ్య, ఒంటిమిట్ట కోదండ రాముడు ఎందరికో ఇలవేల్పులు. పగలంతా పని పాట్లతో శ్రమించే అన్నదాతలు, శ్రామికులు సాయంత్రం వేళల్లో రామ భజనలతో ఊరట చెందడం తెలుగు రాష్ట్రాలలో కమనీయ దృశ్యాలే. నిజానికి ఏ రాజకీయ పార్టీ ప్రమేయం లేకుండానే భక్తజనులు శ్రీరామున్ని గుణగానాలతో తన్మయత్వం చెందడం కద్దు. ప్రార్థన వ్యక్తిగతం. అయితే రాజకీయ లబ్ధి కోసం పార్టీలు, నేతలు ఇటీవలి కాలంలో భక్తుల విశ్వాసాలను వాడుకోవడం చూస్తున్నాము. రామాలయ ప్రారంభ కార్యక్రమం భక్తులందరికీ సంబంధించిన అంశం. అధికార పార్టీ ఆ ఖ్యాతి తమకే దక్కాలనే పేరాశతో ఇతరులను నిర్లక్ష్యం చేయడంతో కాంగ్రెస్, తదితర పార్టీలు ఈ కార్యక్రమానికి దూరంగా ఉండడం కమలం పార్టీకే మేలనే అభిప్రాయాలూ వున్నాయి. ఒక వంక రామాలయ నిర్మాణ ఖ్యాతిని దక్కించుకుంటూనే, బలమైన ప్రతిపక్ష కూటమి ఏర్పడకుండా కమలనాథులు చేయవలసింది అంతా చేస్తున్నారు. 'ఇండియా' కూటమిలోకి బహుజన సమాజ్ పార్టీని కలుపుకోవడానికి హస్తం పార్టీ తెర వెనుక ప్రయత్నిస్తున్నదనే సంగతి పసిగట్టి, ఇడి, సిబిఐ, ఆదాయపు పన్ను కేసులను తవ్వి తీస్తామని మోడీ మంత్రివర్గంలోని ఓ మంత్రి బెదిరించగానే మాయావతి తన స్వరం మార్చి రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తామని ప్రకటించినట్లు తెలుస్తోంది. బిఎస్‌పి వ్యవస్థాపకుడు స్వర్గీయ కాన్షీరాం అపర చాణక్యుడుగా ములాయం సింగ్ యాదవ్ నాయకత్వంలోని సమాజ్‌వాది పార్టీతో కలసి ఐక్యసంఘటన నిర్మించడంతో మాయావతి 1995లో తొలిసారి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యారు. అయితే పరస్పర విశ్వాస రాహిత్యం వల్ల అదెంతో కాలం నిలువలేదు. 1995 జూన్ 3 నుండి అక్టోబర్ 18 వరకు కొన్ని నెలలు మాత్రమే యుపి 18వ ముఖ్యమంత్రిగా అధికారంలో వున్నారు. 1997 మార్చి 21 నుండి సెప్టెంబర్ 21 వరకు రెండోసారి, 2002 మే 3 నుండి ఆగస్టు 29 వరకు మూడోసారి, 2007 మే 3 నుండి 2012 మార్చి 15 వరకు ఐదేళ్ళు పూర్తి కాలం మాయావతి 4వసారి యుపి ముఖ్యమంత్రిగా వున్నారు. ఆ తర్వాత 2012 నుండి 2017 వరకు రాజ్యసభలో యుపి నుండి ప్రాతినిధ్యం వహించారు. యుపిలో బిజెపి బలహీనంగా వున్న కాలంలోనే బిఎస్‌పి ప్రాబల్యం పెరుగుతూ వచ్చింది. అయితే బిఎస్‌పికి ఓటేసిన దళితులు, దళితేతరులు, యాదవేతర బిసిలు క్రమంగా కమలం పార్టీ వైపు మొగ్గడంతో ఎస్‌పి, బిస్ఎస్‌పి బలం తగ్గుతూ వచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో బలమైన భారతీయ జనతా పార్టీని ఢీ కొట్టడానికి చేతులు కలిపిన ఎస్‌పి, బిఎస్‌పిలు కాంగ్రెస్‌కు అమేథీ, రాయ్‌బరేలి 2 స్థానాలు వదిలేసి చెరి 38 లోక్‌సభ స్థానాలకు పోటీ చేశాయి. ఈ పొత్తుతో బిఎస్‌పి బాగా లబ్ధి పొందింది. 2014 లోక్‌సభ ఎన్నికలలో ఒక్క స్థానం గెలవలేని బిఎస్‌పికి 10 లోక్‌సభ స్థానాలు రాగా, సమాజ్‌వాది పార్టీకి కేవలం ఐదు స్థానాలే రావడంతో అఖిలేశ్ యాదవ్ హతాశుడయ్యారు. పరస్పర ఆరోపణలు, ప్రత్యారోపణలతో కూటమి కుప్పకూలింది. ఎస్‌పి ఓట్లు తమకు రాలేదని, బిఎస్‌పి మద్దతు వల్ల సమాజ్‌వాదీ పార్టీ లాభపడిందనడం వాస్తవ విరుద్ధం. ఈ ఐక్యతను దెబ్బతీయడానికి కమలం పార్టీ మిత్రభేదం కల్పించి చేయవలసిందంతా చేసింది. బిఎస్‌పికి ఇతర రాష్ట్రాలలో స్థానాలున్నా, నామమాత్రంగా సీట్లు గెలుస్తున్నా ప్రధాన బలం దేశంలో దాదాపు 25 కోట్ల జనాభా 400 శాసనసభ, 80 లోక్‌సభ స్థానాలున్న యుపిలో నే. యుపిలో దళిత జనాభా 20.7%, జాతవ్‌లు, పాసి, దోభి, వాల్మీకి తదితర 66 ఉపకులాలున్నాయి. వారిలో 10 శాతంగా వున్న జాతవ్‌లదే ప్రాబల్యం. మాయావతి జాతవ్. అందుకే కొన్ని ఉప కులాలు కమలం పార్టీ వైపు మొగ్గు చూపుతున్నాయి. స్వాతంత్ర్యానంతరం చాలా ఏళ్ల పాటు కాంగ్రెస్‌దే పెత్తనం. ముస్లింలు, దళితులు, బ్రాహ్మణులు, రాజపుత్రులు, వైశ్యులు కాంగ్రెస్ మద్దతుదారులుగా ఉండేవారు. కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రులుగా బ్రాహ్మణుల పెత్తనమే ఉండేది. జాట్లు తదితర కొన్ని వ్యవసాయ కులాలతో రైతాంగాన్ని, బిసిలను చేరదీసి చరణ్ సింగ్ భారతీయ లోక్‌దళ్ పార్టీని ఏర్పాటు చేసినా అది ఎదగలేకపోయింది. కమ్యూనిస్టు పార్టీలు నామమాత్రమే. ఈ సామాజిక నేపథ్యంలో బిజెపి అగ్రనేత ఎల్‌కె అద్వానీ 1990వ దశకంలో జరిపిన రాష్ట్ర యాత్రతో హిందూత్వ శక్తుల పార్టీగా బిజెపి బలం పుంజుకుంది. 2013 నాటికి కేంద్రంలో అధికారంలో వున్న కాంగ్రెస్ నాయకత్వంలోని యుపిఎ ప్రభుత్వం అనేక అవినీతి, అక్రమాల ఆరోపణలతో అప్రతిష్ఠలు గురి కాగా, హిందూ హృదయ సామ్రాట్‌గా నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపి సొంత బలంతో అధికారానికి వచ్చి, రెండోసారి మరింత మెజారిటీతో ముఖ్యంగా యుపి వంటి హిందీ రాష్ట్రాల మద్దతుతో పాలన సాగిస్తూ, వరుసగా 3వసారి అధికారం తమదేనని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఉత్తర, పశ్చిమ ప్రాంతాలకే ఆ పార్టీ బలం పరిమితం. దక్షిణాదిలో వున్న కర్నాటకలో కూడా అధికారం కోల్పోయింది. అయితే మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన విజయాలు కేంద్రంలో వరుసగా 3 వసారి కూడా విజయం తమదేనని కమల నేతలు ప్రధానంగా ప్రధాని మోడీ ధీమాగా వున్నారు. అయితే అధిక ధరలు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం తదితర సమస్యలతో బతుకు భారమైందనే అసంతృప్తి రాజుకుంటోంది. సరైన జాతీయ ప్రత్యామ్నాయం లేకపోవడం కమలనాథులకు కలిసొచ్చింది. లౌకిక ప్రజాస్వామ్య జాతీయ ప్రత్యామ్నాయం నిర్మాణానికి కాంగ్రెస్, తదితర పార్టీలు యత్నిస్తున్నా అంతర్గత విభేదాలు, వైరుధ్యాల వల్ల అది కొలిక్కి రాలేదు. అలా సాగుతున్న ప్రయత్నాలకు బిఎస్‌పి వంటి పార్టీలను బెదిరించడం ద్వారా ప్రతిపక్షాలు ఏకం కాకుండా కకావికలు చేసే కమలం దుస్తం త్రం ప్రస్తుతానికి పారినట్లే కనిపిస్తోంది. దేశంలోని ఓ పెద్ద దళిత పార్టీ చేరువకాకుండా ఏ ప్రతిపక్ష కూటమి బలం పుంజుకోలేదు. చాలా రాష్ట్రాలలో అతిపెద్ద పార్టీ బాగా శిథిలమై, నిర్మాణపరంగా వివిధ వర్గాల ప్రజలను కూడగట్టే సామర్థ్యాన్ని కోల్పోయింది. దీటైన ప్రత్యామ్నాయం లేకే ప్రజలు చేసేదిలేక ఉత్తర, పశ్చిమ ప్రాంతాలలో కమలం పార్టీ వైపు మొగ్గుతున్నారనే అభిప్రాయాలున్నాయి. ఈ పరిస్థితుల్లో ఒంటరిగా పోటీ చేయాలనే మాయావతి బహుజన సమాజ్ పార్టీ నిర్ణయం పాలక బిజెపికి మేలు చేస్తుంది. యుపిలో ఒంటరిగా బరిలోకి దిగి ఏనుగు తన పూర్వబలాన్ని సాధించగలుగుతుందా లేక ప్రతిపక్ష ఓట్లు చీల్చి కమలానికి అమిత బలం చేకూరుస్తుందా!

# నాసిరకం చదువులు



మన దేశ గ్రామీణ ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలు ఎలా ఉన్నాయో వెల్లడించే అసర్-2023 నివేదిక బుధవారం వెలువడింది. గ్రామీణ ప్రాంతాల్లోని 14-18 ఏళ్ల మధ్య వయసు ఉన్న విద్యార్థులపై ఈ సర్వే జరిగింది. ఈ వయసు యువతీ యువకుల్లో 13.2 శాతం మంది చదువుకు దూరంగా ఉన్నారట! విద్యాభ్యాసం చేస్తున్న వారిలో మూడింట ఒక వంతు (33.7 శాతం) మంది జీవన భృతి కోసం బయట ఏదో ఒక పని చేయాల్సి వస్తోందిట ! అందుతున్న చదువులోనూ నాణ్యతాప్రమాణాలు నాసిరకంగా ఉన్నాయని ఈ సర్వే గణాంకాలు చెబుతున్నాయి. మాతృభాషలోని రెండో తరగతి పాఠాన్ని 26.4 శాతం మంది హైస్కూలు, కాలేజీ విద్యార్థులు చదవలేకపోతున్నారట! అయితే, ఇందులో అబ్బాయిల కన్నా అమ్మాయిల పరిజ్ఞానం కాస్త మెరుగ్గా ఉంది. మూడంకెల సంఖ్యను ఒక అంకెతో భాగించమని అడిగితే- నూటికి 57 మంది సరైన జవాబు రాబట్టలేకపోయారట! 'ఐ లైక్ టు రీడ్', 'షి హాజ్ మెనీ బుక్స్' వంటి చిన్న చిన్న ఆంగ్ల వాక్యాలను 62.7 శాతం మంది చదవలేకపోయారట! చదివిన వారిలోనూ 26.5 శాతం మంది వాటి అర్థమేమిటో సరిగ్గా చెప్పలేకపోయారట! నిత్య జీవితంలో తారసపడే సమయం లెక్కింపు, కొలతలు, శాతాలు వంటి గణింపూ తెలియని పిల్లలూ సగానికి పైగానే ఉన్నారట! అదే సమయంలో స్మార్టుఫోన్ల వినియోగం, సోషల్ మీడియాలో చురుగ్గా ఉండడం హెచ్చుగానే కనిపిస్తోంది. 30 వేల ఇళ్లల్లో సర్వే జరిపితే, సుమారు 27 వేల ఇళ్లల్లో స్మార్టుఫోన్లు ఉన్నాయి. 92 శాతం యువ విద్యార్థులు వాటిని వినియోగిస్తున్నారు. ఈ సంఖ్యలో అబ్బాయిలదే అత్యధిక భాగం.

ప్రథమ్ అనే సంస్థ 2005 నుంచి గ్రామీణ భారతంలో విద్యావ్యవస్థ తీరుతెన్నులను, విద్యార్థుల నైపుణ్యాలను అధ్యయనం చేస్తోంది. సంవత్సరం తప్పించి సంవత్సరం కొన్ని ప్రాథమిక పరిశీలనాంశాలను గీటురాళ్లుగా పెట్టుకొని విద్యార్థులను కలిసి మాట్లాడుతోంది. గతేడాది అక్టోబరులో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో, 1664 గ్రామాల్లో 17 భాగస్వామ్య సంస్థలతో కలిసి సర్వే నిర్వహించింది. ఐదేళ్ల క్రితం 2017లో చేసినట్టే 14-18 మధ్య వయస్కులపై పరిశీలనలు జరిపింది. తెలుగు రాష్ట్రాల్లో శ్రీకాకుళం, ఖమ్మం జిల్లాలను అధ్యయనానికి ఎంచుకొంది. అన్ని రాష్ట్రాల కన్నా కేరళ ప్రమాణాలు అనేక అంశాల్లో మెరుగ్గా నమోదయ్యాయి. విద్యారంగంపై ఆ రాష్ట్ర ప్రభుత్వం పెడుతున్న ప్రత్యేక శ్రద్ధ అధ్యయన ఫలితాల్లో ప్రతిబింబించింది. కానీ, చాలా రాష్ట్రాల్లో గ్రామీణ విద్యాప్రకాశం మసకబారి కనిపిస్తోంది. పదేళ్ల పాటు విద్యాభ్యాసం కొనసాగాక కూడా విద్యార్థుల్లో కనీస పఠన, గణన, దైనందిన వ్యవహార సామర్థ్యాలు కనపడడం లేదు. జీవన నైపుణ్యాలు అలవడాల్సిన దశలో ఉన్న విద్యార్థులకు సాధారణ తెలివిడిని కూడా మన విద్యావ్యవస్థ ఎందుకు ఇవ్వలేకపోతోంది? నోటిలెక్కలు కూడా చేత కాని నిస్సహాయ స్థితిలోకి వారిని నెట్టేస్తున్నది ఎవరు? కొన్ని దశాబ్దాలుగా ప్రయివేటు విద్యకు పెద్ద పీట వేసి, సర్కారు విద్యకు చెదలు పట్టించిన పాలకుల నిర్లక్ష్యమూ, నిర్వాచీతనమే ఇందుకు ప్రధాన కారణం.

విద్యాసంస్థల్లో ఏళ్ల తరబడి ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీ చేయకపోవడం, నియమించినా కాంట్రాక్టు పోస్టులకే పరిమితం చేయడం, బోధనాపరమైన సదుపాయాలను సమకూర్చకపోవడం వంటివన్నీ విద్యా ప్రమాణాలు దిగజారిపోవటానికి దారి తీస్తున్నాయి. అన్ని వయసుల వారిలోనూ లెక్కించే, ప్రశ్నించే స్వభావాన్ని తార్కిక శక్తి పెంపొందిస్తుంది. మనిషి భాగస్వామ్యాన్ని, ఆలోచనలను శూన్యపరిచే 'ఏమీ చేయకపోయినా పర్లేదు' అన్న హీన సంస్కృతి ఇటీవల ప్రబలుతోంది. అన్నిటికీ స్మార్ట్‌ఫోన్ల వంటి సాంకేతిక ఉపకరణాల మీదనే ఆధారపడడం పెరుగుతోంది. కంప్యూటరు, స్మార్ట్‌ఫోన్ల వినియోగం గణనీయంగా పెరిగిందనిబీ వాటిలోనే సినిమాలు చూడడం, గేమ్స్ ఆడడం అంతటా అలముకొందని ఈసారి ప్రథమ్ సర్వే ప్రత్యేకంగా పేర్కొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాణ్యమైన విద్యను అందించే బాధ్యతను చిత్తశుద్ధితో అమలు చేయాలి. నవ, యువ తరాల్లో తార్కికశక్తిని కొడిగట్టేలా మోహరిస్తున్న మత, మార్కెట్ మాయాజాలాలకు అడ్డుకట్ట వేయాలి. 'తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు రూపొందించబడుతుంది' అన్న ఉత్తమ మాటకు ఉక్కు సంకల్పంతో కూడిన ఆచరణను జోడించాలి. అలా జరిగేలా ప్రభుత్వాలపై ఒత్తిడి తేవడం తల్లిదండ్రుల, మేధావుల, విద్యార్థి యువజన సంఘాల బాధ్యత.

# ఇంధన పొదుపుపై అవగాహన



మండించినపుడు శక్తిని ఉత్పత్తి చేసే పదార్థాన్ని ఇంధనం అంటారు. ఇంధన వాడకం నిత్యకృత్యం. వాహనాలు నడవడానికి, విద్యుత్ ఉత్పత్తి చేయడానికి, వంట చేయడానికి ఇలా ఇంధనం ఎన్నో రకాలుగా ఉపయోగ పడుతున్నది. ఇష్టారాజ్యంగా, ఇబ్బడి ముబ్బడిగా ఇంధన వనరుల వినియోగం భవిష్యత్ అవసరాలను ప్రశ్నార్థకంగా మారుస్తున్నది. ఈ నేపథ్యంలో ఇంధన వనరుల రక్షణ అనివార్యంగా ప్రతి ఒక్కరి బాధ్యతగా మారింది. అవసరాలకు మించి వినియోగం చేస్తూ, పొదుపుపై అదుపు లేకుంటే భవిష్యత్తు అంధకారమే. అందుకే సంప్రదాయేతర ఇంధన వినియోగం ప్రత్యామ్నాయ మార్గంగా చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. శక్తి రహితంగా ఏ పనీ సాధ్యం కాదు. అందుకు తగిన సాధనం ఇంధనమే. మనకు తెలియకుండానే మనం ప్రతిక్షణం ఎన్నోరకాల ఇంధనాలపై ఆధారపడి జీవిస్తున్నాం. మనం ఇంట్లో వాడుకునే లైటు, ఫ్యాను, టీవీ, సెల్ఫోన్, మిక్సీ, గ్రైండర్, పొయ్యి మొదలు రైలు, బస్సు, బైక్, విమానం, రాకెట్ ప్రతీది ఇంధనంపై ఆధారపడే ఇలా నడుస్తుంది. ఇంధనం లేకుండా ఒక్క క్షణం కూడా గడవదంటే అతిశయోక్తి కాదు. నీరు, పెట్రోల్, డీజిల్, బొగ్గు, విద్యుత్, కట్టెపుల్లలు సహా ఎన్నో రకాల ఘన, ద్రవ, వాయు ఇంధ నాలు, యురేనియం, థోరియం వంటి అణు రసాయన ఇంధనాలు మనకు నిత్య జీవితంలో ఇంధనాలుగా ఉపయోగ పడుతున్నాయి. అలాంటి ఇంధనాలే లేకపోతే ముందు ముందు ఇబ్బందికర పరిస్థితులు నెలకొంటాయి. ఇబ్బడి ముబ్బడి ఇంధన వనరుల వినియోగం భవిష్య అవసరాలను ప్రశ్నార్థకం చేస్తోంది. ఈ నేపథ్యం లో ఇంధన వనరుల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా మారింది..

జనాభా రోజురోజుకూ భారీగా అడ్డూ అదుపూ లేకుండా పెరుగుతున్నది. జనాభా పెరుగుదలతో పాటే పెట్రోలు, డీజిల్, గ్యాసు, విద్యుత్ వంటి ఇంధన వనరుల వినియోగం విపరీతంగా పెరుగుతోంది. రానురాను ఇంధనాలు సరిపోని క్లిష్టతర పరిస్థితులు రాబోతున్నాయి. ఒక రకంగా దేశ ఆర్థిక పరిస్థితులను ప్రభావితం చేసే పారిశ్రామిక రంగ ప్రగతిని నిర్దేశించేదేవే ఇంధన వనరులు. అందుకే అభివృద్ధి చెందుతున్న దేశంగా మన దేశంలో ఇంధన వనరుల వినియోగం ఇటీవల కాలంలో విపరీతంగా పెరిగింది. ఫలితంగా సంప్రదాయ ఇంధన వనరులు హరించుకుపోతున్నాయి. ఇలాంటి ఇంధన వనరులను రక్షించడమే నేడు ప్రధాన కర్తవ్యంగా మారింది. సంప్రదాయ ఇంధన వనరులైన బొగ్గు, పెట్రోల్, డీజిల్, అణు ఇంధనాలు ప్రకృతిలో పరిమితంగా మాత్రమే లభిస్తాయి. వాటిని ప్రస్తుతం వినియోగిస్తున్నట్లుగా విపరీతంగా వినియోగిస్తే ప్రమాదం తప్పదు. ప్రస్తుతం మనం చేస్తున్న వృధా, భవిష్యత్తు తరాలకు అంధకారాన్ని మిగులుస్తుంది. దీనికి మనమే బాధ్యత వహించాలి. అందుకోసం సాంప్రదాయేతర ఇంధన వనరులైన సౌర, పవన, టైడల్ (సముద్ర కెరటాలు) విద్యుత్ వనరులపై ఆధార పడాలి.

పెట్రోల్ డీజిల్ గ్యాసులకు బదులుగా బయో ఇంధన వనరులను, బయోడీజిల్, బయో గ్యాస్ వంటి ఇంధన వనరులపై ఆధారపడడం వల్ల భవిష్యత్తు తరాలకు మేలు చేసినవారం అవుతామని ఇకనైనా గ్రహించాలి. పునరుత్పాదక ఇంధన పథకాలకు నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇటీవలి కాలంలో విశేష కృషి చేస్తున్నది. స్వచ్ఛమైన శిలాజ ఇంధనాలను, పర్యావరణ హితమైన ఇంధనాలను తగిన పరిమాణంలో అందుబాటు యోగ్యంగా ఉండేలా చూడటానికి ప్రాధాన్యం ఇస్తున్నది. దేశంలో సులభతర వాణిజ్య నిర్వహణకు ఎంతో చేయూత అందిస్తున్నది. స్వదేశీ, విదేశీ పెట్టుబడి దారులకు సదుపాయంగా ఉండేలా, అన్ని మంత్రిత్వ శాఖల్లో ప్రాజెక్ట్ అభివృద్ధి విభాగాలను విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విభాగాలను ఏర్పాటు చేసింది. ఇంధన పేదరికాన్ని అంతం చేసే దిశగా, స్వచ్ఛమైన శిలాజ ఇంధనాలను, పర్యావరణ హితమైన ఇంధనాలను తగిన పరిమాణంలో అందుబాటులో ఉంచుకోవడానికి మార్గ నిర్దేశం చేస్తున్నది. స్వచ్ఛందంగా శిలాజ ఇంధన వినియోగం, స్వదేశీ ఇంధనాలపై మరింత ఎక్కువగా ఆధారపడటం, విద్యుత్ సేవలను పెంచడం, తాజాగా ఆవిర్భవిస్తున్న హైడ్రోజన్ వంటి ఇంధనాలవైపు మరలడం, అన్ని ఇంధన వ్యవస్థల్లో డిజిటల్ సృజనాత్మక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం తదితర అంశాలపై ప్రభుత్వ దృష్టి కేంద్రీకృతమై ఉంది.

## 'జై హింద్'ను శ్వాసించిన 'నేతాజీ'

భరతజాతి ముద్దు బిడ్డ నేతాజీ సుభాస్ చంద్రబోస్ జన్మదినోత్సవాలను 23 జనవరి 2021 నుంచి "పరాక్రమ్ దివస్"గా ఘనం నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వశాఖ నిర్ణయించడం హర్షదాయకం. నేతాజీ జయంతిని 'దేశ్ ప్రేమ్ దివస్'గా కూడా జరుపుకునే ఆనవాయితీ గతంలో ఉండేదని మనకు తెలుసు. 126వ జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నేతాజీ దేశభక్తి, ధైర్యసాహసాలు, అకుంఠిత దీక్ష, నిస్వార్థ పోరాట పటిమ, వలస పాలన వ్యతిరేక ఆవేశ పోరాట పటిమను నేటి ప్రజలకు, ముఖ్యంగా యువతకు ప్రేరణగా చూపాలని భావిస్తున్నది. సుభాష్ చంద్ర బోస్ జీవితానికి సంబంధించిన రహస్య పత్రాలను ప్రజల ముందు ఉంచాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం 133 ఫైల్‌లను 2015 - 16లో బహిరంగ పరచడం జరిగింది. 2019లో అండమాన్‌లోని 3 ద్వీపాలకు నేతాజీ సుభాస్ చంద్ర బోస్ ద్వీపం, షహీద్ ద్వీపం, స్వరాజ్య ద్వీపమని నామకరణం కూడా చేయడం సమంజసంగా ఉంది. 23 జనవరి 1897న కటక్‌లో ప్రభావతి, జానకినాథ్ బోస్‌లకు జన్మించిన సుభాస్ చంద్ర బోస్ విద్యాభ్యాసం కటక్, కలకత్తా (బి.ఏ. ఫిలాసఫీ), లండన్ - కేంబ్రిడ్జ్ (బి.ఏ. మెంటల్ అండ్ మోరల్ సైన్స్)ల్లో కొనసాగింది. తండ్రి ప్రోద్బలంతో లండన్‌లో ఇండియన్ సివిల్ సర్వీస్ పరీక్షలు రాసి ఎంపికైన నేతాజీ బ్రిటీష్ ప్రభుత్వంలో పని చేయడం ఇష్టం లేక ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి మనందరికీ స్ఫూర్తి ప్రదాతగా నిలిచారు. దేశభక్తిని ఒంటి నిండా నింపుకున్న సుభాస్ చంద్ర బోస్ వలస పాలనకు వ్యతిరేకంగా 2వ ప్రపంచయుద్ధ సమయంలో నాజీ జర్మనీ, జపాన్‌ల పక్షాన నిలిచి, వారి సహాయం తీసుకోవడం జరిగింది. భారత జవాన్లు ముద్దుగా 'నేతాజీ' అని పిలవడంతో తనకు అది బిరుదులా మారి, తన పేరులో కలిసి పోయింది. కలకత్తా మేయర్‌గా (1930 - 31) సేవలు అందించిన బోస్ జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా, భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా (1938 - 39) పని చేశారు. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా ఉద్యమ సంస్థలతో రహస్య సంబంధాలు కలిగి ఉన్నారనే కారణంగా అనేక సార్లు అరెస్టులు కూడా అయ్యారు. 1920 - 34ల మధ్య జరిగిన భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రతో కూడిన పుస్తకం 'ది ఇండియాస్ స్ట్రగుల్' అనబడే పుస్తకం రచించారు. మహాత్మాగాంధీతో విభేదించి కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి ఫార్వర్డ్ బ్లాక్ పార్టీని స్థాపించి దాని ప్రథమ అధ్యక్షుడిగా (1939 - 41) బాధ్యతలు నిర్వహించారు. 1940లో బ్రిటీష్ ప్రభుత్వం గృహనిర్బంధం విధించిన వేళ తప్పించుకొని 1941లో జర్మనీ చేరారు. తన సహచరి ఎమిలీని వివాహమాడి కూతురికి జన్మనిచ్చారు. అడాల్ఫ్ హిట్లర్ సహాయంతో జపాన్‌కు చేరి 40,000 మంది భారతీయ యువకులతో కూడిన 'భారత జాతీయ ఆర్మీ' స్థాపించి శిక్షణను ఇచ్చారు. తన ఆర్మీతో కలిసి దేశ స్వాతంత్ర్యం కోసం 'జై హింద్?' నినాదంతో సాయుధ పోరాటం చేయ సంకల్పించారు. 1944 - 45లో జరిగిన 2వ ప్రపంచ యుద్ధంలో బ్రిటీష్ ఇండియన్ ఆర్మీతో పోరాటంలో తన ఆర్మీలో సగం మంది ప్రాణాలు

# క్రేజీ నాయకులకే టిక్కెట్



**అదిలాబాద్ :** లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ యాక్షన్ ప్లాన్ రెడీ చేస్తోంది. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని ఫలితాలు రావడంతో మంచి ఊపు మీదున్న బిజెపి రాబోయే లోక్ సభ ఎన్నికలకు బీజేపీ అధిష్టానం నేరుగా రంగంలోకి దిగింది. కేంద్రంలో అధికారమే చేపట్టడమే లక్ష్యంగా .. మూడోసారి అత్యధిక స్తానాల్లో సీట్లు గెలిచేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణపై ప్రత్యేక ద్రుష్టి సారించారు.కేంద్ర మంత్రి అమిత్ షా నాయకత్వం లో ఢిల్లీలో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం ఏర్పాటు చేసారు .జెపి నడ్డా , అమిత్ షా,బి.ఎల్ సంతోష్ లు పాల్గొన్న ఈ సమావేశంలో పార్లమెంట్ క్లస్టర్ ఇంఛార్జిలు పాల్గొన్నారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై క్యాడర్‌కు ఈ సమావేశంలో దిశా నిర్దేశం చేశారు.ఈ సమావేశం లో అమిత్ షా మాట్లాడుతూ.. ధన ప్రమేయం లేని ఎన్నికలు జరగాలి .. ప్రజా స్వామ్యం బతకాలి.. సామాన్యుడు సైతం ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితి రావాలని అన్నారు. 2047 సంవత్స్మరం వరకు బీజేపీ ఉండాలని ? దేశానికి బీజేపీ ఆవశ్యకత చాలా ఉందని ? స్వాతంత్ర్యం వచ్చి వంద ఏళ్లు పూర్తి అయ్యే సరికి దేశం అభివృద్ధి చెందిన దేశంగా మారాలని అన్నారు. మూడో సారి అత్యంత మెజారిటీతో అధికారం లోకి రావాలని ఆశాభావం వ్యక్తం చేసారు. ఇక.. పార్లమెంట్ స్థానాలను 143 క్లస్టర్ లుగా బీజేపీ నిర్ణయించింది. తెలంగాణ లో 5 క్లస్టర్ లు ఏర్పాటు చేసారు. ఒక్కో క్లస్టర్ కు ఒక్కో ఇన్ చార్జ్ ఉంటారు.అధికార , ప్రతిపక్ష పార్టీలు ప్రచార పర్వానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెలాఖరున తెలంగాణా రాష్ట్రానికి అమిత్ షా రానున్నారు. అనంతరం ఫిబ్రవరి నెలలో తెలంగాణ లో 10 రోజుల పాటు బీజేపీ యాత్రలు చేసే దిశగా ప్రణాళికలు రచిస్తున్నారు. తెలంగాణలో 5 ప్రాంతాల నుంచి ప్రారంభించబోయే ఈ యాత్రలు , పార్లమెంట్ క్లస్టర్ వారీగా చేయడం జరుగుతుంది. ఈ ఎన్నికల్లో జనం గుండెల్లో నాటుకుపోయే ఎజండాలతో వెళ్ళాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.. అందులో భాగంగానే .. తెలంగాణ అప్పులు తీరాలన్న , తెలంగాణ అభివృద్ధి చెందాలన్న మరో సారి మోడీ అధికారం లోకి రావాలి? ఈ అంశంతో ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ ఆలోచన ఉంది.ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్దుల ఎంపికకై ఇప్పటికే కసరత్తులు మొదలు పెట్టింది. మొన్న ఫలితాలను సృష్టిలో పెట్టుకున్న బిజెపి నార్త్ తెలంగాణలో తన సత్తా చాటుకుంది. ఈ ఎన్నికల్లో సౌత్ తెలంగాణా లో బోణీ కొట్టి పాగా వేసేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది.ముఖ్యంగా ఎంపీ టికెట్ల ఆశిస్తున్న వారిపై బీజేపీ అగ్రనేత అమిత్ షా స్పెషల్ ఫోకస్ చేస్తున్నట్లు తెలుస్తోంది.ప్రజలలో క్రేజ్ ఉన్న నాయకునికే టికేట్ ఇవ్వాలని .. ఇందుకు సంబందించిన ఫీడ్ బ్యాక్ సైతం ఎప్పటికప్పుడు గోప్యంగా తెలుసుకుంటున్నట్లు సమాచారం. ఒకరకంగా చెప్పాలంటే గెలిచే దమ్మున్న వారికే టికెట్ ఇచ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

# భూ దందాలపై సిట్...



**హైదరాబాద్ :** పదేళ్లు అధికారాన్ని అడ్డుపెట్టుకుని కరీంనగర్‌లో అడ్డూ అదుపు లేకుండా అక్రమాలు, భూకబ్జాలకు పాల్పడిన బీఆర్‌ఎస్ నేతలపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. ఖద్దరు నేతల చిట్టా విప్పుతున్నారు. కటకటాల వెనుకకు పంపిస్తున్నారు. అక్రమార్కుల భరతం పట్టేందుకు కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి ప్రత్యేకంగా సిట్ ఏర్పాటు చేశారు. సిట్ చేపట్టిన ఆపరేషన్‌లో ఇద్దరు నేతల భూకబ్జాల వ్యవహారం బయటకు వచ్చింది. వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో గులాబీ నేతల్లో అలజడి మొదలైంది.సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి కొత్త రాజిరెడ్డికి చెందిన భూమి విషయంలో బీఆర్ఎస్ నాయకులు చీటి రామారావుతోపాటు కొంతమంది నాయకులు జోక్యం చేసుకుని మూడేళ్లుగా ముప్పు తిప్పలు పెడుతున్నారు. మూడేళ్లుగా తన భూమి తనకు దక్కకుండా చేస్తున్న నేతలపై రాజిరెడ్డి ఎక్కని మెట్టు లేదు.. తొక్కని గడప లేదు. అయితే నాడు బీఆర్ఎస్ అధికారంలో ఉండడంతో పోలీసులు కూడా చర్యలకు వెనుకాడారు. దీంతో బాధితుడు మీడియా ముందు కూడా పలుమార్లు తన గోడు వెళ్లబోసుకున్నాడు. అయితే ప్రధాని మీడియా ప్రతినిధులు నాడు మంత్రిగా ఉన్న గంగుల కమలాకర్, కేటీఆర్‌కు తొత్తుగా మారి అక్రమాలను వెలుగులోకి రానివ్వలేదు. దీంతో మీడియా ముందుకు వచ్చినా ఫలితం లేకుండా పోయింది.2024 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం కూలిపోయింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కరీంనగర్‌కు చెందిన పొన్నం ప్రభాకర్ మంత్రి అయ్యారు. వెంటనే బాధితుడు ప్రజాభవన్‌కు వెళ్లి ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేశాడు. బీఆర్ఎస్ నాయకులు చీటి రామారావు అరాచకాన్ని వివరించాడు. న్యాయం చేయాలని వేడుకున్నాడు. స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ పోలీసులను కలవాలని సూచించారు. దీంతో రాజిరెడ్డిలో ఆశలు చిగురించాయి. వెంటనే కరీంనగర్‌కు వచ్చిన ఆయన సీపీ అభిషేక్ మహంతిని కలిశాడు. తనకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకున్నాడు. దీంతో కేసు పూర్వాపరాలు పరిశీలించిన పోలీసు అధికారులు బీఆర్ఎస్ కార్పొరేటర్ తోట రాములు, చీటి రామారావు, నిమ్మశెట్టి శ్యాం లపై ఐపీసీ సెక్షన్ 447, 427 తీ/ఠి 34లలో కేసు నమోదు చేశారు. కార్పొరేటర్ తోట రాములు, చీటి రామారావును బుధవారం అరెస్ట్ చేసిన రిమాండ్ కు తరలించారు.కరీంనగర్‌లో భూ దందాలపై పోలీస్ బాస్ అభిషేక్ మహంతి ఆరా తీస్తున్నారు. ప్రత్యేక సిట్ ఏర్పాటు చేసి బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. వాటి పూర్వాపరాలు పరిశీలించి, నిజా నిజాలు నిర్ధారించుకుంటున్నారు. తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి సామాన్యులను ఇబ్బంది పెడుతున్న నేతల వివరాలు సేకరిస్తున్నారు. వారిపై ఇప్పటికే నిఘా పెట్టారు. అక్రమాలకు పాల్పడిన, వారికి కొమ్ము కాసిన అధికార యంత్రాంగాన్ని కూడా బాధ్యులను చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. భవిష్యత్‌లో తమది కాని భూములు ముట్టుకోవాలంటేనే భయపడేలా చర్యలు తీసుకోవాలని సీపీ పోలీసులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. దీంతో గులాబీ కార్పొరేటర్లలో వణుకు మొదలైనట్లు తెలుస్తోంది.

## అయోధ్యకు శ్రీవారి లడ్డూలు

### తిరుపతి ఎయిర్పోర్ట్ నుంచి ప్రత్యేక కార్గో ఛాపర్ ద్వారా తరలింపు



**తిరుపతి :** రామజన్మభూమి అయోధ్యకు శ్రీవారికి ఎంతో ప్రీతికరమైన లడ్డూలను టీటీడీ తరలించింది. 22వ తేది దేశమంతా రామనామంతో మారుమ్రోగనున్న వేళ, రామజన్మభూమి తీర్థ ట్రస్ట్ శ్రీవారి లడ్డూ ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేయనుంది. శుక్రవారం సాయంత్రం తిరుమల నుంచి తిరుపతికి లక్ష లడ్డూల శనివారం ఉదయం తిరుపతి ఎయిర్పోర్ట్ తరలింపు కార్యక్రమాన్ని చేపట్టారు. అయోధ్యలో శ్రీరామ చంద్రమూర్తి ఆలయ ప్రారంభోత్సవానికి లక్ష లడ్డూలు పంపిణీ చేయాలని పాలకమండల నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. కుందన్నారు. లక్ష లడ్డూలను తయారు చేసి, శుక్రవారం ప్రత్యేకంగా పాకింగ్ చేయించారు . శనివారం తిరుపతి విమానాశ్రయం నుండి ఉదయం 9 గంటల 30 నిమిషాలకు ప్రత్యేక కార్గో ఎయిర్ క్రాఫ్ట్ ద్వారా అయోధ్యకు లడ్డూలు చేరుకున్నాయి. ఈలడ్డూలను . 22వ తేదీన అయోధ్యలో భక్తులకు ప్రసాదంగా పంపిణి చేయనున్నారు.

## కోల్డ్ స్టోరేజ్ లో అగ్నిప్రమాదం

**దుగ్గిరాల :** గుంటూరు జిల్లా దుగ్గిరాల రైలుపేటలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ లో ఒక్కసారిగా అగ్ని ప్రమాదం చోటుచేసుకుని పొగలు కొమ్ముకున్నాయి. సిబ్బంది జరిగిన ప్రమాదాన్ని గుర్తించి అగ్నిమాపక శాఖకి సమాచారం అందించారు. తెనాలి, గుంటూరు,మంగళగిరి నుండి నాలుగు అగ్నిమాపక సిబ్బంది ప్రమాదం జరిగే ప్రాంతానికి మంటలు అర్పే చర్యలు చేపట్టారు.సుమారు 1లక్ష 50వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న కోల్డ్ స్టోరేజ్ లో అగ్ని ప్రమాదం సంభవించడంతో ఆ ప్రాంతం మొత్తం పొగలు కమ్ముకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది ఒకపక్క మంటలు అర్పుతుంటే మరోవైపు మంటలు వ్యాపించడంతో ప్రమాదం అదుపులోనికి తీసుకుని రావడానికి శ్రమించాల్సిన వచ్చింది. అగ్నిప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది

## డివైడర్ ను ఢీకొన్న కారు?ముగ్గురు మృతి

**జోగులాంబ :** గద్వాల పట్టణం జమ్మిచేడు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన కారు అదుపు తప్పి డివైడర్ ను ఢీకొంది. కారులో ఉన్న 6 మందిలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి.

## ఫోక్సో కేసులో మేస్త్రి అరెస్టు

**సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు మండలం ఇస్నాపూర్ లో నివాసం ఉంటున్న మేస్త్రి పెద్దిరాజు పై అత్యాచారం కేసు నమోదు అయింది. తన వద్ద కూలీ పనికి వచ్చిన ఓ మహిళతో మేస్త్రి కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలోనే మహిళలేని సమయంలో ఆమె కూతురు (బాలిక) పై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలియడంతో పటాన్చెరు పోలీస్ స్టేషన్లో తల్లి ఫిర్యాదు ఇవ్వడంతో పోలీసులు ఫోక్సో కేసు నమోదు చేసారు.

## ఏనుగుల బీభత్సం

**మన్యం :** కొమరాడ మండలం గంగిరేగువలస గ్రామ సమీపంలో ఉన్న పంట పొలాల్లో ఏనుగులు సంచరించడంతో సుమారు 20 ఎకరాల టమాట పంటను నాశనం చేశాయి. అరటి, జొన్న వంటి పంటలను ఏనుగులు నాశనం చేయడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. గతంలో పెట్టిన నష్టపరిహారం కూడా ఇప్పటివరకు రాలేదంటూ రైతులు తెలిపారు. ఇప్పుడైనా పోయిన పంటకు నష్టపరిహారం చెల్లించాలంటూ రైతులు కోరుకుంటున్నారు.


## ఓటమి భయంతో జగన్ మోహన్ రెడ్డి




**అనకాపల్లి :** ఓటమి భయంతోనే జగన్ మోహన్ రెడ్డి తన ఎమ్మెల్యేలను మారుస్తున్నారని అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ విమర్శించారు.మంత్రి గుడి వాడ అమర్నాథ్ పేదల టిడ్కో గృహా లను అమ్ముకున్నారని ఆరోపించారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవ్వగానే పెంచిన కరెంట్, గ్యాస్, పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గిస్తామ న్నారు.

# నిబంధనల ప్రకారమే చెల్లింపులు

**హైదరాబాద్ :** ఫార్ములా–ఇ కార్ రేసింగ్ చెల్లింపుల వ్యవహారంలో తన తప్పు లేదని సీనియర్ ఐఏఎస్ అధికారి వివరణ ఇచ్చారు. ఈ కార్ రేసింగ్ సంస్థతో ఒప్పందంపై ఖజానాకు నష్టం వాటిల్లడంపై రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మెమోకు సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్ వివరణ ఇచ్చారు.రేసింగ్ సంస్థకు చెల్లింపుల విషయంలో నిబంధనల మేరకే తాను వ్యవహరించానని, ప్రభుత్వ ఆదేశాలనుఅమలు చేసినట్లు అర్వింద్ కుమార్ వివరణ ఇచ్చారు. ఫార్ములా–ఇ కార్ రేసింగ్‌కు సంబంధించిన ఒప్పందాల ప్రక్రియ అంతా సజావుగానే జరిగిందని, దానికి అనుగుణంగా రూ.55 కోట్ల చెల్లింపులు జరిగాయని వివరణలో పేర్కొన్నారు.ఫార్ములా–ఇ రేస్‌కు సంబంధించిన తొమ్మిది అంశాలపై వివరణ కోరుతూ ఈ నెల ఆరో తేదీన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి.. అర్వింద్ కుమార్‌కు సంజాయిషీ నోటీసులు జారీ చేశారు. ఒక్కో అంశంపై అర్వింద్‌కుమార్ సమగ్రంగా వివరణ ఇచ్చినట్లు తెలుస్తోంది.ప్రభుత్వ అనుమతులు లేకుండానే తెలంగాణలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో నిబధంనలకు విరుద్ధంగా నిధులు విడుదల చేసిన వ్యవహారంలో సీనియర్ ఐఏఎస్ అధికారికి రాష్ట్ర ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. క్యాబినెట్ అనుమతి, ఆర్థిక శాఖ ఆమోదం లేకుండా రూ.54కోట్ల విడుదల చేశారనే అభియోగాలపై వారం రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించింది.హెచ్ఎండిఏ కమిషనర్‌గా వ్యవహరించిన అరవింద్ కుమార్ నిబంధనలకు విరుద్ధంగా నిధుల విడుదల చేసి ఉల్లంఘనలకు పాల్పడ్డారని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత 2023 అక్టోబర్30వ తేదీన ఎన్నికల కమిషన్ అనుమతి లేకుండానే ఈ రేసింగ్ ప్రాజెక్టుకు నిధుల్ని విడుదల చేశారు. కొత్త ప్రాజెక్టులకు నిధుల విడుదల చేయడంపై ఖచ్చితంగా నిబంధనలు పాటించాల్సి ఉన్నా క్యాబినెట్ అమోదం లేకుండా, ఆర్థికశాఖ అనుమతులు లేకుండానే హైదరాబాద్‌లో పార్ములా–ఈ రేస్ పోటీలను నిర్వహించేందుకు హెచ్ఎండీఏ ఒప్పందం కుదుర్చుకోవడం చర్చనీయాంశంగా మారింది.పోటీల నిర్వహణ కోసం రూ. 54 కోట్లు ముందస్తుగా చెల్లించారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుం డా ఒప్పందాన్ని అతిక్రమించి రేస్ రద్దు చేసినందుకు మున్సిపల్ శాఖకు లీగల్ నోటీసులు ఇస్తామంటూ ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఆటోమొబైల్స్ (ఎస్ఐఏ) ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యవహారంపై దృష్టిసారించింది. ఈ క్రమంలో నిధుల విడుదల అంశం వెలుగులోకి వచ్చిందికార్ రేసింగ్ నిర్వహణపై ఒప్పందం, నిధుల విడుదల విషయంలో నిబంధ నలకు విరుద్ధంగా వ్యవహరించారంటూ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రత్యేక కార్యదర్శి అరవింద్‌కుమార్‌కు చీఫ్ సెక్రటరీ నోటీసులు జారీ చేశారు. ఫార్ములా ఈ రేసింగ్ పోటీల నిర్వహణపై ప్రభుత్వం నుంచి సరైన అనుమతులు తీసుకోకుండానే నిర్ణయాలు తీసుకున్నారని సిఎస్ ఉత్తర్వులో పేర్కొన్నారు. హెచ్ఎండిఏ నుంచి బిల్లుల రూపంలో రూ.46కోట్లు పన్నుల రూపంలో మరో 9 కోట్లను చెల్లించడానికి కారణాలు ఏమిటన్నది తెలపాలని సిఎస్ ఆదేశించారుగత ఏడాది ఫిబ్రవరి–11న హైదరాబాద్లో జరిగిన సీజన్–9 పార్ములా–ఈ రేస్ నిర్వహణకు రూ.200 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో ఈవెంట్ నిర్వాహక సంస్థలైన గ్రీన్‌కో రూ.150కోట్లు, హైదరాబాద్ రేసింగ్ లిమిటెడ్ రూ.30కోట్లు ఖర్చుచేశాయి. రహదారులు, ఇతర మౌలిక వసతులకు హెచ్ఎండీఏ రూ.20 కోట్లు ఖర్చు చేసింది. ఈ ఏడాది తలపెట్టిన ఫార్ములా–ఈ 10వ సీజన్ ఈవెంట్కు రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఫెసిలిటేటర్‌గా ఉండాల్సి ఉంది. ఖర్చు మొత్తం ప్రైవేటు సంస్థలైన గ్రీన్ కో ఫార్ములా ఈ సంస్థ భరించాల్సి ఉంది.



# కొత్త టీమ్ కోసం పెద్ద కసరత్తు




**హైదరాబాద్ :** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పై నిరుద్యోగుల్లో నమ్మకం కలిగించేలా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. టీఎస్పీసీని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసి? కొత్త టీమ్‌ను ఎంపిక చేయనుంది. ఇందుకోసం టీఎస్పీసీ చైర్మన్ అండ్ టీమ్ ఎంపికపై కసరత్తు చేస్తోంది. దీంతో ఇప్పుడు టీఎస్పీసీ కొత్త బాస్ ఎవరనేది హాట్‌టాపిక్‌గా మారింది.తెలంగాణలో నిరుద్యోగులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న టీఎస్పీసీ ప్రక్షాళనకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే ని ప్రక్షాళన చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి? ఆ దిశగా వేగం పెంచారు. పాలకమండలి రాజీనామాలకు గవర్నర్ ఆమోదం తెలపడంతో ఇప్పుడు కొత్త బోర్డు ఎంపికపై కసరత్తు మొదలుపెట్టింది.ఇక నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులు, వారి తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించే విధంగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా చైర్మన్ అండ్ బోర్డు సభ్యుల ఎంపికపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటోంది. ప్రక్షాళన రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ఎంతో ప్రతిష్టాత్మకం. గత ప్రభుత్వ హయాంలో టీఎస్పీసీ నిర్వహించిన పరీక్షల లీకేజీలు.. ఎన్నికలు సమీపిస్తున్న వేళ హడావుడిగా నోటిఫికేషన్లు వేసి కోర్టు మెట్లు ఎక్కడం లాంటివాటితో బోర్డు అప్రతిష్టపాలైంది. దీంతో ఎన్నికల ప్రచారంలో బోర్డు ప్రక్షాళనలపై రేవంత్‌రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు.దీంతో ఇప్పుడు కొత్త టీమ్ ఎంపికతోనే ప్రజలకు భరోసా ఇవ్వాలని భావిస్తోంది ప్రభుత్వం. ఇప్పటికే టీఎస్పీసీ చైర్మన్, సభ్యుల కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించింది. దీంతో ప్రభుత్వానికి భారీగా దరఖాస్తులు వచ్చాయి. తెలంగాణలోని ఉస్మానియా, జేఎన్టీయూ, కాకతీయ యూనివర్సిటీలతో పాటు.. ప్రైవేట్ యూనివర్సిటీల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్స్ స్వచ్ఛంద సంస్థలకు చెందిన ప్రతినిధులు కూడా పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. చైర్మన్‌తో పాటు, 10 మంది సభ్యులతో పాలకమండలి ఉంటుంది. వీరిలో సగం మంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో పనిచేసి ఉండాలన్నది నిబంధన. దీంతో ఇప్పుడు బోర్డు ఎంపికలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటోంది తెలంగాణ ప్రభుత్వం. అయితే చైర్మన్‌గా మంచి ట్రాక్ రికార్డ్ ఉన్న ఎఖూ అధికారిని ఎంపిక చేస్తే నిరుద్యోగుల్లో నమ్మకం వస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనగా ఉంది. దీంతో మొన్నటిదాకా కమిషనర్‌గా పనిచేసిన ఎఖూ అధికారి పేరును సీఎం పరిశీలనలో ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఆ అధికారికి ఇంకా ఐదేళ్ల సర్వీస్ ఉండటంతో దాన్ని వదులుకునేందుకు అతను సిద్ధంగా లేరన్న చర్చ సాగుతోంది.అయితే ఈ మధ్య రిటైర్డ్ అయిన ఓ అధికారి పేరును కూడా ప్రభుత్వం పరిశీలనలో ఉంది. ఇక మాజీ ఎఐా ఆకునూరి మురళీ, ప్రొఫెసర్ కోదండరాం, హరగోపాల్, నాగేశ్వర్ పేర్లను పరిశీలించినప్పటికీ? టీఎస్పీసీ నిబంధనల మేరకు వయస్సు పరిమితి సరిపోవడం లేదు.ఒకవేళ వీలుకాకపోతే? ఎగ్జామినేషన్స్ నిర్వహణలో అనుభవం ఉన్న ప్రొఫెసర్స్ వైపు తెలంగాణ ప్రభుత్వం మొగ్గు చూపనుంది. ఇప్పటికే ఊఅజ, ాజ, ఏఔజ, కాకతీయ యూనివర్సిటీల్లో పనిచేస్తున్న మంచి ట్రాక్ రికార్డ్ ఉన్న ప్రొఫెసర్స్‌ను ఎంచుకునే అవకాశం కనిపిస్తోంది.ఇప్పుడు వచ్చిన దరఖాస్తులను స్క్రీనింగ్ చేసి? చైర్మన్, సభ్యులుగా ఎంపిక కోసం ప్రభుత్వం ఓ ప్రత్యేక కమిటీ వేయనుంది. దీనిద్వారా అన్ని కోణాల్లో పరిశీలించి, పాలకమండలి ఎంపికను తెలంగాణ ప్రభుత్వం పూర్తి చేయనుంది. అది కూడా పారదర్శకంగా ఈ ప్రక్రియను పూర్తి చేయడం ద్వారా ప్రజలకు మంచి మేసేజ్ ఇవ్వాలని భావిస్తోంది. చూడాలి మరి టీఎస్పీసీ చైర్మన్ అండ్ టీమ్‌లో ఎవరిని ఎంపిక చేస్తారో..

# గులాబీ నుంచి చేజారుతున్న కార్పొరేషన్




**కరీంనగర్ :** అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి బీఆర్ఎస్ ఇంకా తేరుకోకముందే.. ఆ పార్టీకి షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. ఇప్పటికే నల్లగొండ కార్పొరేషన్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా పలు మున్సిపాలిటీలు బీఆర్ఎస్ నుంచి 'హస్త'గతమయ్యాయి. కార్పొరేటర్లు, కౌన్సిలర్లు సొంత పార్టీ మేయర్లు, చైర్మన్లపై అవిశ్వాసం ప్రకటిస్తున్నారు. ఇలా ఇప?పటికే రాష్ట్ర వ్యాప్తంగా పలు మున్సిపాలిటీలు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ ఖాతాలో పడ్డాయి. ఇంకా అనేక మున్సిపాలిటీలు హస్తగతం కావడానికి సిద్ధంగా ఉన్నాయి. అధికారంలో లేని గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు అడ్డుకునే ప్రయత్నం కూడా చేయడం లేదు. చేష్టలుడిగి చూస్తున్నారు. ఈ జాబితాలో బీఆర్ఎస్ కంచుకోట అయిన కరీంనగర్ కార్పొరేషన్ కూడా చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్‌కు చెందిన కార్పొరేటర్లు పార్టీని చీల్చే దిశగా పావులు కదుపుతున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నంతకాలం అధికారాన్ని అడ్డుపెట్టుకుని అరాచకాలు చేసిన సదరు నేతలు.. ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరేందుకు యత్నిస్తున్నారు. తొమ్మిది మంది కార్పొరేటర్లు ఇప్పటికే హస్తం పార్టీతో టచ్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. మంత్రి పొన్నం ప్రభాకర్ అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నాలు చేసు?తన్నారు.కరీంనగర్‌లో మాజీ మంత్రి గంగుల కమలాకర్ అండతో బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నేతలు పదేళ్లు అరాచకాలు సాగించారు. పేద, మధ్య తరగతి భూములను కబ్జా చేసి, సెటిల్‌మెంట్ల పేరుతో డబ్బులు వసూలు చేశారు. నకిలీ డాక్యుమెంట్లతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారు. ఇక మాజీ మంత్రివర్యులు కూడా తక్కువేం తినలేదు. తమ అనుచరులు చేస్తున అరాచకాలను అడ్డుకోకపోగా, అండగా నిలిచారు. ఇక జర్నలిస్టులకు ఇళ్ల పట్టాల పేరుతో ఎస్సారెస్పీ భూమలకు గంగుల కమలాకర్ ఎసరు పెట్టారు. మూడెకరాలను జర్నలిస్టులకు పంచి 10 ఎకరాలు తన ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేశారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే అది జరిగేది. కరీంనగర్‌లో గంగుల గెలిచినా.. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రాకపోవడంతో ఈ గుట్టు రట్టయిది.పదేళ్లు కరీంనగర్‌లో బీఆర్ఎస్ నాయకులు సాగించిన అరాచకాలపై ప్రజాభవన్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణితోపాటు, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పొన్నం ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు, కార్పొరేటర్లు చేసిన కబ్జాలు, భూదందాలపై నివేదిక ఇవ్వాలని కాంగ్రెస్ నేతలను ఆదేశించారు. ఈమేరకు స్థానిక నేతలు కబ్జా నేతల చిట్టా తయారు చేస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా పోలీస్ బాస్ కూడా బీఆర్ఎస్ కార్పొరేటర్లు, గతంలో మాజీ మంత్రి అనుచరులమని చెప్పుకుని కొంత మంది నాయకులు సాగించిన భూ దందాలపై దృష్టిపెట్టారు. బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి కబ్జాదారలపై ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమవుతున్నారు.ఒకవైపు మంత్రి, మరోవైపు పోలీసులు బీఆర్ఎస్ నేతలు, కరీంనగర్ కార్పొరేటర్ల సాగించిన అరాచకాల చిట్టా విప్పుతున్నారు. దీంతో కబ్జా నేతల్లో అలజడి మొదలైంది. ఇప్పటికే భూకబ్జా కేసులో కార్పొరేటర్ తోట రాములు, బీఆర్ఎస్ నాయకుడు తోట రాములు అరెస్ట్ అయ్యారు. దీంతో తమ వంతు ఎప్పుడు వస్తుందో అని ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో కొందరు గులాబీ పార్టీ వీడి హస్తం గూటికి చేరేందుకు మంతనాలు జరుపుతున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ శరణు వేడుకునే ప్రయత్నం చేసు?తన్నారు. ఈమేరకు స్థానిక కాంగ్రెస్ నాయకులతో మంతనాలు జరుపుతున్నారు. పొన్నం అపాయింట్‌మెంట్ కోసం ఎదురు చూస్తున్నారు.మంత్రి పొన్నం ప్రభాకర్.. ఈ విషయంలో ఎలా వ్యవహరిస్తారన్నది ఇప్పుడు ఆసక్తిగా మారింది. ఒకవైపు కబ్జాదారులపై కొరడా ఝుళిపించాలని ఆదేశించిన మంత్రి.. ఇప్పుడు బీఆర్ఎస్‌లోని అవినీతి, భూకబ్జా నేతలు, కార్పొరేటర్లకు అపాయింట్ మెంట్ ఇస్తారా అన్న చర్చ జరుగుతోంది. ఏ ఎండకు ఆ గొడుగు పట్టే నేతలను కాంగ్రెస్ లో చేర్చుకుంటే.. బీఆర్ఎస్ మురికి కాంగ్రెస్ అంటడం ఖాయం. దీని ప్రభావం వచ్చే లోక్‌సభ ఎన్నికలపై పడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే జర్నలిస్టుల ఇళ్ల స్థలాల పంపిణీలో అక్రమాలను వెలికి తీసిన మంత్రి.. ఎస్సారెస్పీ భూమి అన్యాక్రాంతం కాకుండా ఆపారు. దీంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్‌లో ఉండి అరాచకాలు చేసిన నేతలు, కార్పొరేటర్లను ఇప్పుడు కాంగ్రెస్‌లో చేర్చుకుంటే మంత్రిపై, కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసం దెబ్బతింటుందని పేర్కొంటున్నారు.

# సింహపురిలో రెబల్స్ బెడద



**నెల్లూరు :** వైసీపీకి కంచుకోట లాంటి సింహపురిలో ముగ్గురు ఎమ్మెల్యేలు రెబల్?గా మారారు. వారంతా టీడీపీతో కలిశారు. ఇపుడు మరో వికెట్ పడుతుందా.. అంటూ డిస్కషన్ నడుస్తోంది. సీనియర్ మోస్ట్ లీడర్, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి కేంద్రంగా ఈ చర్చ జరుగుతోంది. అయితే ఆ వార్తలకు ఎంపీ ఇస్తున్న క్లారిటీ ఇదే.. ఆదాల ప్రభాకర్ రెడ్డి.. పాతికేళ్ళుగా రాజకీయాల్లో ఉంటున్నారు. జిల్లాలో సీనియర్ నేత. 1999లో అల్లూరు నియోజకవర్గం నుంచి టీడీపీ తరపున పోటీచేసి గెలుపొందారు. మంత్రిగా కూడా పనిచేశారు. 2004లో నియోజకవర్గం.. అలాగే పార్టీ మారి కాంగ్రెస్ నుంచి సర్వేపల్లిలో మాజీమంత్రి సోమిరెడ్డిపై రెండు సార్లు విజయం సాధించారు. 2019లో వైసీపీ తరపున నెల్లూరు పార్లమెంట్ నుంచి పోటీచేసి గెలుపొందారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఆదాల ప్రభాకర్ రెడ్డి పోల్ మేనేజ్మెంట్?లో ఎక్స్పర్ట్ అనే పేరుంది. ఒక్క సారి మినహా పోటీచేసిన ప్రతిసారీ ఆదాల గెలుస్తూనే వచ్చారు. 2019 ఎన్నికలకు కొద్దిరోజులు ముందు టీడీపీ వీడి వైసీపీలో చేరారు. నెల్లూరు లోక్ సభ నుంచి గెలుపొందారు.నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పార్టీకి దూరం కావడంతో నెల్లూరు రూరల్ ఇంచార్జ్?గా ఆదాల ప్రభాకర్ రెడ్డిని నియమించారు అధినేత జగన్. నెల్లూరు రూరల్ నుంచి ఈ సారి ఎన్నికల్లో పోటీలో దింపింది అధిష్టానం. ఇప్పటికే ముగ్గురు ఎమ్మెల్యేలు పార్టీకి దూరమవడం.. ఆదాల కూడా పార్టీని వీడుతారంటూ వస్తున్న వార్తలతో డిస్కషన్ బాగానే జరిగింది. అయితే ఆదాల ఈ వార్తలపై మీడియాకు క్లారిటీ ఇచ్చారు. అయితే ఆదాల కోసం టీడీపీ గట్టిగానే ప్రయత్నాలు చేసింది. అడిగిన చోట టికెట్టు ఇస్తామని చెప్పినా ఆదాల మాత్రం పార్టీ మారడానికి ససేమిరా అన్నారట. దీంతో మళ్లీ ఆదాల వేదికగా పుకార్లు మొదలయ్యాయి. నారా లోకేష్?తో ఆదాల భేటీ అంటూ ప్రచారం జరిగింది. ఈ వార్తలపై ఆదాల ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇలాంటి ప్రచారం చేస్తే న్యాయపరంగా చర్యలు తప్పవని కూడా హెచ్చరించారు. జరుగుతున్న ప్రచారం పట్ల ఆదాల అసలు విషయం బయట పెట్టారు. పార్టీలోకి రానందుకు టీడీపీ తనను డ్యామేజ్ చేసేందుకు మైండ్ గేమ్ ఆడుతోందని అంటున్నారు. ఒక టీమ్?ను జనంలోకి పంపి ఆదాల చివర వరకు పార్టీలో ఉండరనే మాటలను ప్రజల్లోకి చేరేలా వ్యూహంతో ఇలా చేస్తోందని తెలిపారు. టీ షాపులు, ప్రధాన కూడళ్లలో సామాన్యుల్లా కలిసిపోయిన ఒక బృందం ఆ ఎంపీని డ్యామేజ్ చేస్తోందట. తన ప్రత్యర్థులు ఇలాంటి ప్రచారాలు చేస్తున్నారని అంటున్నారు. అవసరమైతే రాజకీయాల నుంచి తప్పుకుంటానే తప్ప వైసీపీని వీడి టీడీపీకి వెళ్ళేది లేదని తెగేసి చెబితున్నారు ఆదాల. దీంతో వచ్చిన వార్తలన్నీ నీలివార్తలుగా మారిపోయాయి.

## నిరుపేదలకు చీరలు పంపిణీ



**వాస్తవ నేస్తం,వైరా:** లయన్స్ క్లబ్ కార్యక్రమంలో భాగంగా వారి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేయాలని ఉద్దేశంతో గుర్రం విశిష్ట గుర్తింపుగా జీ.వి మాల్ వారి ఆధ్వర్యంలో విశిష్ట ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుర్రం సీతా కుమారి గుర్రం సుమతి నిరుపేదలకు చీరలు పంపిణీ చేశారు క్లబ్ అధ్యక్షులు పెనుగొండ ఉపేంద్ర రావు అధ్యక్షతన స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం నందు గుర్రం విశిష్ట పుట్టినరోజును పురస్కరించుకొని వైరాలోని నిరుపేద వృద్ధులకు12500 రూపాయలు విలువచేసే చీరలు పంపిణీ చేస్తూ వైస్ డిస్టిక్ గవర్నర్ 2 నంబూరు మధు మాట్లాడుతూ విశిష్ట ఫౌండేషన్ స్థాపించిన నాటినుండి వైరా మండలానికి ఎంతో అనుబంధం ఉందని వారి సహకారంతో వివిధ పాఠశాలలకు వివిధ రకాల సేవా కార్యక్రమాలు మౌలిక వసతులు రక్తదాన శిబిరాలు నిర్వహించడం జరిగిందని విశిష్ట ఫౌండేషన్ వారిని మధు వారిని అభినందించినారు.. క్లబ్ అధ్యక్షులు పెనుగొండ ఉపేంద్ర రావు మాట్లాడుతూ విశిష్ట ఫౌండేషన్ నిర్వాహకులు ఆర్థికంగా ఎదిగినప్పటికిని మానవత దృక్పథంతో మానవతా విలువలను కాపాడుతూ నిరుపేదల మధ్య విశిష్ట పుట్టినరోజులు చేసుకోవటం సంతోష్ దాయకమని అన్నారు ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు పెనుగొండ ఉపేంద్ర రావు, గుర్రం సీతాకుమారి, గుర్రం సుమతి, చింతోజు నాగేశ్వరరావు,కొల్లా రాంబాబు, మరికంటి రాంగోపాల్, రాయపూడి నారాయణ, మచ్చ రామారావు,గద్దె నీరజ, చెరుకూరి శ్రీనివాసరావు, శీలం పిచ్చిరెడ్డి, తాటికొండ రాము, వాడపల్లి జ్యోతి వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యచంద్రిక కు లాప్టాప్ వితరణ



**వాస్తవ నేస్తం,వైరా:** ఆర్థికంగా వెనుకబడిన బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు సహాయ సహకారాలు అందించడంలోనూ భవిష్యత్తుకు బంగారు బాటలు వేయటంలోనూ వారి కలలు నెరవేర్చటంలో లయన్స్ క్లబ్ వైరా ఎల్లవేళలా కృషి చేస్తుందని వైస్ డిస్టిక్ గవర్నర్ నంబూరు మధు, ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ అన్నారు. లయన్స్ క్లబ్ వైరా అధ్యక్షులు పెనుగొండ ఉపేంద్ర రావు అధ్యక్షతన స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం నందు బీ.టెక్ పూర్తి చేసుకొని ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తూ ల్యాప్టాప్ అవసరాన్ని గుర్తించిన వైరాలోని రాజశేఖర్ నగర్ కు చెందిన నిరుద్యోగిని వాడపల్లి దివ్యచంద్రిక కు 40 వేల రూపాయలు విలువచేసే లాప్టాప్ కంప్యూటర్ మురళీకృష్ణ చేతుల మీదుగా అందించారు ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ యు శ్యాంబాబు రీజియన్ చైర్ పర్సన్ లగడపాటి ప్రభాకర రావు చింతోజు నాగేశ్వరరావుకొల్లా రాంబాబు మరికంటి రాంగోపాలు తాటికొండ రాము రాయపూడి నారాయణ మచ్చ రామారావుగద్దె నీరజ చెరుకూరి శ్రీనివాసరావుశీలం పిచ్చిరెడ్డి గుర్రం సీతసుమతి వాడపల్లి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించిన మధు



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** రామచంద్రపురం పట్టణంలో గుర్తుతెలియని మృతదేహానికి సంబంధించిన వాళ్ళు ఎవరు రాకపోవడంతో ఎండిఆర్ ఫౌండేషన్ చైర్మన్ మధు అంత్రక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నాను. సమాజ సేవ నిర్వహించడమే తమ ధ్యేయమన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని అన్నారు. ఎండిఆర్ ఫౌండేషన్ చైర్మన్ మధు సేవా కార్యక్రమాలను పలువురు అభినందించారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, RNI NO: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vnteluguddaily@gmail.com, vaasthavanestham.com